Follow: @ANNTELUGU
27-12-2024
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 26 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బెళగావిలో కాంగ్రెస్
ఎన్నికల సంఘంపైనే అనుమానాలు
మోదీ సర్కారు వైఖరి వల్లే ఇదంతా
భగ్గుమన్న మల్లిఖార్జున ఖర్గే
త్వరలో పార్టీపదవులన్నీ భర్తీ చేస్తాం
వివరాలు 4లో

టాప్ న్యూస్



### అస్వస్థతకు గురైన సోనియా గాంధీ
- కర్ణాటకలోని బెళగావిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలు
- తల్లి వెంటే ఉన్న ప్రియాంక గాంధీ

03



### తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు: ఛార్మీ
- ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందన్న ఛార్మీ
- వారి విజనరీ నాయకత్వం అభినందనీయం అంటూ ట్వీట్

03



### మధ్య తరగతికి బిగ్ రిలీఫ్
- ఆదాయం పన్ను శ్లాబ్‌ల్లో నిర్మలమ్మ మ్యాజిక్
- రూ.15 లక్షల వరకూ నో టాక్స్?

03



06

## బీజేపీ ఎమ్మెల్యేపై గుడ్డు దాడి

## వారం రోజులు సంతాప దినాలు
నేడు సెలవు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, మహా:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వం సంతాపం తెలియజేసింది. వారం రోజులపాటు సంతాప దినాలను ప్రకటించాలని నిర్ణయించింది. అదే విధంగా రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు శుక్రవారం (నేడు) సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో నేడు సెలవుదినంతో పాటు వారం రోజులు సంతాపదినాలను పాటించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నది.

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 77,730 |
| 22 క్యారెట్ | 71,250 |
| సిల్వర్ (కేజీ) | 91,600 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 78,472.48 |
| నిఫ్టీ ↗ | 23,750.20 |

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.85 | 175.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.85 | 175.5 |
| రిటైల్ గుడ్డు ధర | 6.20 | 186.03 |



# సినిమాకు రేవంత్ భరోసా
## కలిసినడుద్దాం.. ముందడుగు వేద్దాం

### హైదరాబాద్‌లో మెగా ఫిల్మ్ ఫెస్టివల్
- భారతీయ చిత్రపరిశ్రమనంతా ఒక్కచోటికి తీసుకువద్దాం
- సినిమాకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ హబ్ కావాలి
- పరిశ్రమకు అన్ని విధాలుగా సహకరిస్తాం
- ఐటీ, ఫార్మాలాగా సినిమా కూడా ప్రాధాన్యరంగం
- ఆలయాల్లో కూడా షూటింగ్ లు చేసుకోండి.. టెంపుల్ టూరిజాన్ని డెవలప్ చేయండి
- సినీపెద్దల భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- స్వాగతించిన సినీప్రముఖులు.. భేటీకి హాజరైన దిల్ రాజు, అల్లు అరవింద్, నాగార్జున, వెంకటేష్
- హైదరాబాద్ వరల్డ్ సినిమా కేపిటల్ కావాలిక- నాగార్జున
- మాకు సీఎం రేవంత్ రెడ్డి పెద్ద టాస్క్ ఇచ్చారు- దాన్ని మేము రీచ్ కావాలి- దిల్ రాజు
- ఈ ప్రభుత్వంపై నమ్మకముంది- దగ్గుబాటి సురేష్
- నెట్ ఫ్లిక్స్ అమెజాన్ కు హైదరాబాద్ కేరాఫ్ కావాలి

02

“ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇకపై బెనిఫిట్ షోలు ఉండవని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీలో తాను ఏదయితే ప్రకటన చేశానో.. దానికే కట్టుబడి ఉంటానని తేల్చి చెప్పారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డితో సినీ ప్రముఖులు భేటీ అయిన విషయం తెలిసిందే. సినీ పరిశ్రమ అభివృద్ధి, గద్దర్ అవార్డ్స్, టికెట్ రేట్లు, బెనిఫిట్ షోలు సహా పలు అంశాలపై సీఎం, సినీ పెద్దల మధ్య చర్చలు నడిచాయి. బెనిఫిట్ షోలు ఉండవని సీఎం చెప్పడంతో కనీసం సంక్రాంతి సినిమాలకైనా అవకాశం ఇవ్వాలని సినీ పెద్దలు కోరగా.. కుదరదని సీఎం తేల్చి చెప్పినట్లుగా తెలుస్తోంది.


### ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించాలి- రాఘవేంద్రరావు



రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. అందరు సీఎంలు ఇండస్ట్రీని బాగానే చూసుకున్నారన్నారు. ఈ ప్రభుత్వం కూడా తమని బాగా చూసుకుంటోందని తెలిపారు. దిల్ రాజును FDC చైర్మన్‌గా నియమించడాన్ని స్వాగతిస్తున్నా అని పేర్కొన్నారు. అంతేకాకుండా తెలంగాణలో అద్భుతమైన టూరిస్ట్ స్పాట్‌లు ఉన్నాయన్నారు. గతంలో చంద్రబాబు చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ హైదరాబాద్‌లో చేశారని.. ఇప్పుడు కూడా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను హైదరాబాద్‌లో నిర్వహించాలని కోరుతున్నాం అని అన్నారు.

## ఇంటర్నేషనల్ హబ్‌గా హైదరాబాద్ ను తీసుకెళ్ళడమే లక్ష్యం
సీఎంతో భేటీ అనంతరం ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు
వివరాలు 2లో

నవ భారత రూపశిల్పి
# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూత
ఎయిమ్స్‌లో కన్నుమూసిన కాంగ్రెస్ కురువృద్ధుడు
రెండు పర్యాయాలు ప్రధానిగా పనిచేసిన మౌనముని
దేశంలో ఆర్థిక సంస్కరణల అమలులో కీలకపాత్ర




**ఢిల్లీ, మహా:** మాజీ ప్రధాని, కాంగ్రెస్ కురువృద్ధుడు నవ భారత రూపశిల్పి మన్మోహన్ సింగ్ ఇక లేరు. కాంగ్రెస్ కురువృద్ధుడు మన్మోహన్ సింగ్(92) గురువారం ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో తుది శ్వాస విడిచారు. వృద్ధాప్య సంబంధిత కారణాలతో ఆయన్ని కుటుంబీకులు ఆస్పత్రిలో చేర్చగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మన్మోహన్ సింగ్ మృతికి ప్రధాని మోదీతో సహా రాజకీయ ప్రముఖులందరూ నివాళులు అర్పించారు. వార్త తెలిసిన వెంటనే ప్రియాంక గాంధీ ఎయిమ్స్ కు చేరుకోగా, మల్లిఖార్జునఖర్గే, రాహుల్ గాంధీ కార్యక్రమాలు రద్దుచేసుకుని బెళగావి నుండి ఢిల్లీ వెళ్ళారు. మిగతా 3లో

### ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్ సంతాపం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన మన్మోహన్ సింగ్ మరణం పట్ల విచారం వ్యక్తం చేశారు. పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, సీతక్క తదితరులు సంతాపం తెలిపారు. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి సంతాపం తెలిపారు.



## శ్రీతేజ్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు
సంధ్య థియేటర్ ఘటన రాజకీయం చేస్తున్నారు
బీఆర్ఎస్ నేత హరీశ్ రావు

**మహా, తెలంగాణ:** కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను గురువారం బిఆర్ఎస్ నేతలు పరామర్శించారు. ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వివేకానంద, బండారు లక్ష్మారెడ్డి, సీనియర్ నేతలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, నవీన్ రావు తదితరులు ఆసుపత్రికి చేరుకుని బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మిగతా 3లో

## నేను మీ పొంగులేటి శీనన్నను
అశ్వారావుపేట నియోజకవర్గ పర్యటనలో మహిళా కూలీలతో ముచ్చట
సంక్రాంతి నాటికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని హామీ



**అశ్వారావుపేట :** ఏం అక్కాచెల్లమ్మలు బాగున్నారా... సొంత ఇళ్లున్నాయా మీకు....ఇంతకీ నేనేవరో తెలుసా...? మీ ఇంటి వాచీలో నా బొమ్మ ఉంది గుర్తు పట్టారా...? అంటూ మహిళా కూలీలతో తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కాసేపు సరదాగా ముచ్చటించారు. అశ్వారావుపేట నియోజకవర్గ పర్యటనకు గురువారం వచ్చిన ఆయన అశ్వారావుపేట మండలంలో తన పర్యటనను ముగించుకుని ములకలపల్లి వెళ్తూ మార్గమధ్యలో శనగకాయలు శుభ్రపరుస్తున్న మహిళా కూలీలను చూసి ఆగారు. వారితో పై విధంగా కాసేపు సరదాగా సంభాషించారు.... చేతికి గాజులు వేయించుకోమని చెప్పి కొంత నగదును అందించారు. అదేవిధంగా కొద్ది దూరం వెళ్ళాక మరొక ప్రాంతంలో ఆగి అక్కడ ఉన్న మహిళలతో మాట్లాడి సంక్రాంతి నాటికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని నచ్చినట్టు కట్టుకోమని హామీ ఇచ్చారు.



## అయిదుగురు జర్నలిస్టులు మృతి!
06

## గ్రూప్ -1 అభ్యర్థులకు హైకోర్టు షాక్
పిటిషన్ కొట్టివేత
ఫలితాల వెల్లడికి లైన్ క్లియర్



02

## బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల అరెస్ట్
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు
- కేటీఆర్, హరీష్ ఆగ్రహం
- ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీ అమలు: కేటీఆర్
- బెయిల్‌పై ఎర్రోళ్ల విడుదల



వివరాలు 2లో




# సినిమాకు రేవంత్ భరోసా

**మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇకపై బెనిఫిట్ షోలు ఉండవని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీలో తాను ఏదయితే ప్రకటన చేశానో.. దానికే కట్టుబడి ఉంటానని తేల్చి చెప్పారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డితో సినీ ప్రముఖులు భేటీ అయిన విషయం తెలిసిందే. సినీ పరిశ్రమ అభివృద్ధి, గద్దర్ అవార్డ్స్, టికెట్ రేట్లు, బెనిఫిట్ షోలు సహా పలు అంశాలపై సీఎం, సినీ పెద్దల మధ్య చర్చలు నడిచాయి. బెనిఫిట్ షోలు ఉండవని సీఎం చెప్పడంతో కనీసం సంక్రాంతి సినిమాలకైనా అవకాశం ఇవ్వాలని సినీ పెద్దలు కోరగా.. కుదరదని సీఎం తేల్చి చెప్పినట్లుగా తెలుస్తోంది. ఈ సందర్భంగా సంధ్య థియేటర్ ఘటనను సీఎం ప్రస్తావిస్తూ... శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదని సినీ పెద్దలకు ఆయన స్పష్టం చేశారు. ఇకపై బౌన్సర్ల విషయంలో సీరియస్‌గా ఉంటామని చెప్పారు. అభిమానుల్ని కంట్రోల్ చేయాల్సిన బాధ్యత కూడా సెలబ్రిటీలదే అని చెప్పారు. టెంపుల్ టూరిజం, ఎకో టూరిజంను ప్రమోట్ చేయాలని వారికి స్పష్టం చేశారు. ఇన్వెస్ట్‌మెంట్ల విషయంలోనూ ఇండస్ట్రీ సహకరించాలని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు నరేందర్ రెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, నిర్మాత అల్లు అరవింద్, హీరోలు వెంకటేశ్, నాగార్జున సహా రాఘవేంద్రరావు, మురళీ మోహన్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**అందుకే ఆ పదవి..**

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "సినీ పెద్దలు చిత్ర పరిశ్రమ సమస్యలను మా దృష్టికి తెచ్చారు. వారి అనుమానాలు, అపోహలు, ఆలోచనలను మాతో పంచుకున్నారు. ఎనిమిది సినిమాలకు మా ప్రభుత్వం స్పెషల్ జీవోలు ఇచ్చింది. పుష్ప సినిమాకు పోలీస్ గ్రౌండ్ ఇచ్చాం. తెలుగు సినిమా పరిశ్రమకు ఒక బ్రాండ్ క్రియేట్ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. పరిశ్రమ బాగుండాలని కోరుకున్నాం. ఐటీ, ఫార్మాతో పాటు చిత్ర పరిశ్రమా మాకు ముఖ్యం. తెలంగాణలో అవార్డులు ఇవ్వడం లేదని తెలిసి గద్దర్ అవార్డును ఏర్పాటు చేశాం. ప్రభుత్వం, సినిమా పరిశ్రమకు మధ్య వర్తిగా ఉండేందుకు దిల్ రాజును ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా నియమించాం. పరిశ్రమ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశాం. సినీ పరిశ్రమ సైతం కమిటీని ఏర్పాటు చేసుకోవాలి.

**ఇబ్బంది పెట్టొద్దు..**

తెలంగాణలో ఎక్కడైనా షూటింగ్ చేసుకుని హైదరాబాద్‌కు రెండు గంటల్లో రావొచ్చు. రాష్ట్రంలో ఎకో టూరిజం, టెంపుల్ టూరిజాన్ని ప్రమోట్ చేయండి. టెంపుల్ టూరిజానికి సహకరించండి. ఇక మీదట ఆలయాల్లో షూటింగ్స్ చేసుకోండి. ప్రభుత్వం సగటు ప్రేక్షకుడిని దృష్టిలో పెట్టుకుని ఆలోచిస్తుంది. ప్రేక్షకుడికి అందుబాటులో సినిమా ఉండాలి. టికెట్ ధరలు ప్రేక్షకులు చూసే విధంగా ఉండాలి. ధరల పెంపునకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టొద్దు. సినిమా రంగానికి ప్రభుత్వ సహకారం ఉంటుంది. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపుపై మా విధానాన్ని ఇప్పటికే ప్రకటించాం. దానిపై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేం. మా ప్రభుత్వం పరిశ్రమకు ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.

**సహకరించండి..**

గంజాయి, డ్రగ్స్‌తోపాటు సామాజిక అంశాలపైనా సినిమా పరిశ్రమ ప్రచారం చేయాలి. పరిశ్రమకు ఏది చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాలే చేశాయి. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తాం. సినీ పరిశ్రమను ప్రోత్సాహించడమే మా ముఖ్య ఉద్దేశం. ముఖ్యమంత్రిగా చట్టాన్ని అమలు చేయాల్సిన బాధ్యత నాది. నాకు వ్యక్తిగత ఇష్టాయిష్టాలు లేవు. తెలుగు పరిశ్రమ తెలుగుకే పరిమితం కాకుండా అంతా కలిసి అభివృద్ధి చేద్దాం. ముంబైలో వాతావరణం కారణంగా బాలీవుడ్ అక్కడ స్థిరపడింది.

**గ్రాండ్‌గా సదస్సు..**

కాస్మోపాలిటన్ సిటీల్లో హైదరాబాద్ బెస్ట్ సిటీ. హాలీవుడ్, బాలీవుడ్ హైదరాబాద్ వచ్చేలా చర్యలు ఉండాలి. హైదరాబాద్‌లో పెద్ద సదస్సు ఏర్పాటు చేసి ఇతర సినిమా పరిశ్రమలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం. పరిశ్రమను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లడమే మా ఉద్దేశం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తున్నాం. అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసి నైపుణ్యాలను పెంచి ఉద్యోగాలు కల్పిస్తున్నాం. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఒలింపిక్స్‌లో పతకాలు తెచ్చుకోలేకపోతోంది. స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని" చెప్పారు.

# ఇంటర్నేషనల్ హబ్‌గా హైదరాబాద్‌ను తీసుకెళ్ళడమే లక్ష్యం

## సీఎంతో భేటీ అనంతరం ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్ రాజు



**హైదరాబాద్, మహా:** సినిమాకు ఇంటర్నేషనల్ హబ్‌గా హైదరాబాద్‌ను తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి ఇచ్చిన లక్ష్యానికి అనుగుణంగా పరిశ్రమ దీనిపై కసరత్తు చేస్తుందని ఎఫ్ డిసి ఛైర్మన్ దిల్ రాజు అన్నారు. 'పుష్ప 2' ప్రీమియర్ నిమిత్తం సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన టాలీవుడ్‌కు మాయని మచ్చగా మారింది. ఈ ఘటనని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో.. అటు ప్రభుత్వానికి, ఇటు సినీ పరిశ్రమకు మధ్య వివాదం మొదలైనట్లుగా వార్తలు వైరల్ అవుతున్న క్రమంలో.. ఆ వివాదాలకు ఫుల్ స్టాప్ పెట్టి, ఇండస్ట్రీలోని సమస్యలను తెలిపేందుకు గురువారం సినీ పెద్దలు కొందరు సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి తెలుగు సినిమా ఇండస్ట్రీకి కొన్ని ప్రతిపాదనలు చేయగా.. హాజరైన పెద్దలు కూడా కొన్ని సలహాలు ఇచ్చారు. అనంతరం ఈ సమావేశానికి కారణమైన తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు మీడియాకు మీటింగ్ విశేషాలను తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. "సీఎం రేవంత్ రెడ్డితో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తరఫున జరిగిన సమావేశమిది. ప్రభుత్వానికి, ఇండస్ట్రీకి మధ్య ఎఫ్ డిసి ఛైర్మన్‌గా నేను ముందు ఉండి నడిపించాను. ఇండియా లెవల్‌లో తెలుగు సినిమాకి గౌరవం ఉంది. తెలుగు సినిమాను ఇండియా లెవల్‌లో కాకుండా ప్రపంచ స్థాయిలో చూడాలని సీఎం భావించారు. ఇండస్ట్రీ కూడా సీఎం వ్యూ కు తగినట్లుగా.. ఇంటర్నేషనల్ సినిమాలు కూడా హైదరాబాద్‌లో షూటింగ్ జరిగేలా అన్ని సదుపాయాలు ఏర్పాట్లు చేస్తాం అని హామీ ఇచ్చారు. ఇండస్ట్రీతో చర్చించి, ఇంటర్నేషనల్ హబ్‌గా హైదరాబాద్‌ను తీసుకెళ్లాలని ఎఫ్ డిసి కూడా భావిస్తుంది. అని వెల్లడించారు.

**డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కలిగించాలని**

డ్రగ్స్, మాదక ద్రవ్యాల విషయంలో కూడా మేము అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం కోరారని దిల్ రాజు వెల్లడించారు. ఇండస్ట్రీలోని నటీనటులతో డ్రగ్స్ నిర్మూలనపై కూడా మేము అవగాహన కల్పిస్తాం. సినిమా ఇండస్ట్రీకి ప్రభుత్వంకి మధ్య గ్యాప్ ఉందని అపోహలు ఉన్నాయి. ముఖ్యంగా సంధ్య థియేటర్ ఘటన తర్వాత అలాంటి చర్చకు దారి తీసింది. ఇకపై ప్రభుత్వం మరియు ఇండస్ట్రీ కలిసి పని చేస్తాయి. ఇండస్ట్రీ, ఎఫ్‌డిసి మరియు ప్రభుత్వం కలిపి ఒక కమిటీ వేస్తారు. ఇండస్ట్రీలో ఉన్న సమస్యలపైన కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. సీఎం రేవంత్ రెడ్డితో మరోసారి సినిమా ఇండస్ట్రీ పెద్దలతో సమావేశం ఉంటుంది. డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ బ్రాండ్‌ను పెంచేందుకు ఇండస్ట్రీ తరఫున మా మద్దతు ఉంటుంది. బెనిఫిట్ షోలు, టికెట్ల రేటు పెంపు అనేది చాలా చిన్న విషయం. తెలంగాణ బ్రాండ్‌ను పెంచాలి, అలాగే హాలీవుడ్ సినిమాలు కూడా హైదరాబాద్‌లో షూటింగ్‌లు చేసుకునేలా చర్యలు తీసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మాకు సీఎం రేవంత్ రెడ్డి పెద్ద టాస్క్ ఇచ్చారు దాన్ని మేము రీచ్ కావాలి" అని దిల్ రాజు చెప్పుకొచ్చారు.సిఎం ను కలిసిన వారిలో ...హీరోలు నాగార్జున, వెంకటేశ్, నితిన్, కిరణ్ అబ్బవరం, సిద్ధూ జొన్నలగడ్డ.. దర్శకులు రాఘవేంద్రరావు, త్రివిక్రమ్, కొరటాల శివ, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి, బోయపాటి శీను, వీరశంకర్, హరీశ్ శంకర్, ప్రశాంత్ వర్మ, సాయి రాజేశ్, వశిష్ట.. నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్, సురేశ్ బాబు, సుధాకర్ రెడ్డి, సి.కల్యాణ్, గోపి ఆచంట, శ్యాంప్రసాద్ రెడ్డి, బీవీఎస్ ప్రసాద్, కె.ఎల్.నారాయణ, మైత్రీ రవి, నవీన్ ఉన్నారు

**అంతర్జాతీయ స్థాయిలో స్టూడియో సెటప్ ఉండాలి: - నాగార్జున**

ప్రభుత్వం క్యాపిటల్ ఇన్‌సెంటివ్స్ ఇస్తేనే.. తెలుగు సినీ పరిశ్రమ గ్లోబల్ స్థాయికి ఎదుగుతుంది. ఇంటర్నేషనల్ ఫిల్మ్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ ఉండాలి. హైదరాబాద్ వరల్డ్ సినిమా కేపిటల్ కావాలనేది మా కోరిక. యూనివర్సల్ లెవల్‌లో స్టూడియో సెటప్ ఉండాలి. అని నాగార్జున సూచించారు.

**ప్రభుత్వంపై నమ్మకముంది : దగ్గుబాటి సురేష్**

గత ప్రభుత్వాల మద్దతుతో సినీ పరిశ్రమ మద్రాస్ నుండి హైదరాబాద్ వచ్చింది. ప్రభుత్వంపై నమ్మకముంది. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ సహా అన్ని ఏజెన్సీలకు హైదరాబాద్ కేరాఫ్‌గా ఉండాలి

**ఎలక్షన్ రిజల్ట్ లాగే : మురళీ మోహన్**

సినీ పరిశ్రమకు ప్రభుత్వ గుర్తింపు కావాలి. ఎలక్షన్ రిజల్ట్ లాగే సినిమా రిలీజ్ ఫస్ట్‌డే ఉంటుంది. సంధ్య థియేటర్ ఘటన మమ్మల్ని బాధించింది. సినిమా రిలీజ్‌లో కాంపిటిషన్ వల్లే ప్రమోషన్ కీలకంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా సినిమా రిలీజ్ ఉండడం వల్ల.. ప్రమోషన్‌ను విస్తృతంగా చేస్తున్నాం.



# బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల అరెస్ట్

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి నోటీసులు.. కేటీఆర్, హరీష్ ఆగ్రహం
## ఏడో గ్యారంటీగా ఎమర్జెన్సీ అమలు- సీఎంపై కేటీఆర్ గరంగరం

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేత, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ అయ్యారు. గురువారం ఉదయం హైదరాబాద్ లోని వెస్ట్ మారేడ్‌పల్లిలో ఎర్రోళ్ల ఇంటికి వెళ్లిన జూబ్లీ హిల్స్ పోలీసులు ఆయనను అదుపులోకి మాసబ్ ట్యాంక్ పీఎస్‌కు తరలించారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లో పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆయనపై ఇటీవలే కేసు నమోదైంది. అదేవిధంగా ఇదే వ్యవహారంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం విచారణకు రావాల్సిందిగా కౌశిక్‌కు పోలీసులు నోటీసులు జారీచేశారు... ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు కూడా నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు వెళ్లారు. అయితే.. ఆయన ఇంట్లో నుంచి బయటకు రాలేదు. అనంతరం నోటీసులు ఇచ్చి.. వెంటనే అరెస్ట్ చేశారు. మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్‌కు ఆయనను తరలించారు.

**కేటీఆర్ ఫైర్..**

బీఆర్ఎస్ నేతను అరెస్ట్ చేయడంపై మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని, ఇది దుర్మార్గమని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తున్నందుకే తమపై కక్ష గట్టి అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే తెల్లవారుజామున ఎర్రోళ్ల ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు ఏమో కానీ.. ఏడో గ్యారంటీగా రాష్ట్రంలో 'ఎమర్జెన్సీ'ని ముఖ్యమంత్రి రేవంత్ అమలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. మరోవైపు హరీష్ రావు కూడా అరెస్ట్ ను ఖండించారు. నాంపల్లి కోర్టుకు కూడా పరామర్శకు వెళ్ళారు.

# గ్రూప్-1 అభ్యర్థులకు హైకోర్టు షాక్

## పిటిషన్ కొట్టివేత.. ఫలితాల వెల్లడికి లైన్ క్లియర్

**హైదరాబాద్, మహా:** గ్రూప్ -1 అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు షాకిచ్చింది. గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. రిజర్వేషన్లతో పాటు పలు అంశాలపై హైకోర్టును గ్రూప్-1 అభ్యర్థులు ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఇప్పటికే గ్రూప్-1 పరీక్షలు పూర్తి అయ్యాయి. దీంతో రిజర్వేషన్లు తేలేంత వరకు గ్రూప్-1 ఫలితాలను ఆపాలంటూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కాగా.. జీవో నెంబర్ 29తో పాటు పలు రిజర్వేషన్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ గ్రూప్ - 1 అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. హైకోర్టులో తమ పిటిషన్లపై విచారణ జరిగే వరకు పరీక్షలు వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని అభ్యర్థులు కోరారు. పరీక్షలను వాయిదా వేసే ప్రసక్తే లేదని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. దీంతో అభ్యర్థులు చివరి నిమిషంలో సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. ఆఖరి నిమిషంలో పరీక్షలను వాయిదా వేయలేమని సుప్రీం కూడా తేల్చిచెప్పింది. హైకోర్టులో దీనిపై తేల్చుకోవాలని సూచించింది. ఆ తరువాత రేవంత్ సర్కార్ గ్రూప్-1 పరీక్షలను యథాతథంగా నిర్వహించింది. హైకోర్టు తీర్పుతో గ్రూప్ -1 ఫలితాలకు ఆటంకం తొలగినట్లయింది.

**పరీక్షలు రద్దు చేయాలంటూ గతంలోనూ..**

ఇదిలా ఉండగా... ముందుగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను రద్దు చేయాలంటూ అభ్యర్థులు హైకోర్టు సింగిల్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేయగా.. ఆ పిటిషన్‌ను సింగిల్ బెంచ్ కొట్టివేసింది. దీంతో రెండు రోజులకే సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలంటూ అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను డివిజన్ బెంచ్ కూడా కొట్టివేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో డివిజన్ బెంచ్ ఏకీభవించింది. దీంతో గ్రూప్ -1 పరీక్షలకు అడ్డంకులు తొలగిపోవడంతో తెలంగాణ ప్రభుత్వం పరీక్షలను నిర్వహించింది. ఈఏడాది అక్టోబర్ 21 నుంచి 27 వరకు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రిజర్వేషన్లు తేలేంత వరకు గ్రూప్-1 పరీక్షల ఫలితాలను ఆపాలంటూ అభ్యర్థులు మరోసారి హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా వారికి నిరాశే ఎదురైంది. అభ్యర్థులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను గురువారం హైకోర్టు కొట్టివేసింది.



# ఆర్టీసీలో పెరగనున్న ఎలక్ట్రిక్ బస్సులు

## డీజిల్ బస్సులు ఎలక్ట్రిక్ బస్సులుగా మార్పు
## కేంద్రం సాయం కోరిన సర్కార్..?




**హైదరాబాద్, మహా :** తెలంగాణ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద మహిళలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించరు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఆధార్ కార్డు చూపించి జీరో టికెట్ తీసుకొని ప్రయాణం చేయవచ్చు. ఈ పథకం అమల్లోకి రాకముందు తెలంగాణ వ్యాప్తంగా రోజూవారీ బస్సు ప్రయాణికుల సంఖ్య దాదాపు 25 30 లక్షలు ఉండేది. పథకం అమలు చేశాక ప్రయాణికుల సంఖ్య డబుల్ అయింది. దాదాపు 55 లక్షలకు పైగా ప్రయాణికులు ప్రతిరోజూ ఫ్రీ బస్ సౌకర్యాన్ని ఉపయోగించుకుంటున్నారు. దీంతో బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. కొన్ని బస్సుల్లో అయితే కాలు పెట్టేందుకు కూడా జాగా ఉండట్లేదు. టికెట్ తీసుకునే పురుషులు నిలబడి ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో రద్దీకి అనుగుణంగా ప్రభుత్వం కొత్త బస్సులను తీసుకువారాలని భావిస్తోంది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే పలు సందర్భాల్లో కొత్త బస్సులపై ప్రకటన చేశారు. అయితే డీజీల్ బస్సుల కన్నా.. ఎలక్ట్రిక్ బస్సులపైవు సర్కార్ మొగ్గు చూపుతోంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ మేరకు ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని డిసైడ్ అయ్యారు. అయితే ఎలక్ట్రిక్ బస్సులకు ఖర్చు ఎక్కువగా అవుతోందని ప్రభుత్వం భావిస్తోంది. కొత్త ఎలక్ట్రిక్ బస్సు రూ.1.50 కోట్ల పైనే ఉండటంతో ప్రభుత్వంపై భారం అధికంగా పడే ఛాన్స్ ఉందని ఆలోచనలో పడ్డారు. ఈ ఖర్చును తగ్గించుకునేందుకు కేంద్రం సాయం కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న పాత డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు ఆర్టీసీ ప్రయత్నాలు చేస్తోంది. రెట్రో ఫిట్ మెంట్ పాలసీ ద్వారా వాటిని ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు కేంద్రాన్ని రేవంత్ సర్కార్ సాయం కోరింది. పాత బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చడం ద్వారా సంస్థపై వ్యయ భారం తగ్గే ఛాన్స్ ఉందని భావిస్తున్నారు. కేంద్రం దీనికి అనుమతిస్తే తక్కువ ఖర్చుతో ఎలక్ట్రిక్ బస్సులు రోడ్లపై తిరగనున్నాయి. ఈ మేరకు తెలంగాణ ఆర్టీసీ అధికారులు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే.. పాత బస్సులు ఎలక్ట్రిక్ బస్సులుగా మారనున్నాయి. ఆ తర్వాత బస్సుల్లో రద్దీ తగ్గి టికెట్ తీసుకొని ప్రయాణాలు సాగించేవారికి సీట్లు దొరుకుతాయి.

# పట్టుబట్టి సాధించిన మంత్రి లోకేష్

## జగన్ సర్కార్‌లో కాలేదు.. లోకేష్ చేసి చూపారు

**మంగళగిరి, మహా:** నారా లోకేష్ పట్టుబడితే.. తన వారు అనుకుంటే ఎంతదూరమైనా వెళ్తాడు అనడానికి తాజా సంఘటనను ఉదహరిస్తున్నారు టిడిపి శ్రేణులు. ఏపీ మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్య వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ పట్టుబట్టి అనుకున్నది సాధించింది. చూడటానికి చిన్న పదవి అయినా సరే.. గత వైఎస్సార్‌సీపీ హయాం నుంచి నడుస్తున్న ఈ అంశానికి ఫుల్‌స్టాప్ పెట్టి అనుకున్నది సాధించారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలో దుగ్గిరాల ఇంఛార్జ్ ఎంపీపీగా ఉన్న షేక్ జబీన్.. ఆమెకు అధికారులు సర్టిఫికేట్ జారీ చేయడంతో ఇక పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించేందుకు లైన్ క్లియర్ అయ్యింది. వైఎస్సార్‌సీపీ హయాంలో ఎంపీటీసీ ఎన్నికలు జరిగాయి. దుగ్గిరాల మండల పరిషత్తులో మొత్తం 19 మంది ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగితే.. టీడీపీ, జనసేనకు కలలిపి 10 మంది విజయం సాధించగా.. రిజర్వేషన్లలో భాగంగా ఎంపీపీ పదవి బీసీ మహిళకు కేటాయించారు. టీడీపీ, జనసేన పార్టీల్లో బీసీ మహిళ జబీన్ ఒక్కరే ఉన్నారు. కానీ ఆమెకు బీసీ ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోవడంపై టీడీపీ అభ్యంతరం తెలిపింది. జబీన్ ఇంటి పేరు షేక్ కాదని.. మహమ్మద్ అని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. జబీన్ ఓసీ కిందకు వస్తారు కాబట్టి సర్టిఫికేట్ ఇవ్వలేమని చెప్పారు. జబీన్ మహమ్మద్ తమ ఇంటి పేరు కాదని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని విమర్శలు వచ్చాయి. జబీన్‌కు వరుసకు సోదరులైనవారికి మాత్రం అధికారులు బీసీ కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చారు.. జబీన్‌కు మాత్ర ఆ సర్టిఫికేట్ జారీ చేయలేదు. దీంతో ఆమె పదవికి ఇబ్బంది ఎదురైంది.. ఆ వెంటనే జబీన్ కోర్టును ఆశ్రయించగా.. గుంటూరు జిల్లా అప్పటి కలెక్టరు ఆమె బీసీ కాదని గెజిట్ ఇస్తూ కోర్టుకు సమర్పించారు. అప్పటి మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే తనకు సర్టిఫికేట్ రాకుండా అడ్డుకున్నారని జబీన్‌తో పాటూ టీడీపీ నేతలు ఆరోపించారు. జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. అప్పటి వరకు ఎంపీపీ పదవిలో ఉన్న వైఎస్సార్‌సీపీకి చెందిన దానబోయిన సంతోషరూపవాణి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు వైస్ ఎంపీపీగా ఉన్న జబీన్‌కు ఇంఛార్జ్ ఎంపీపీ బాధ్యతలు అప్పగించారు. తాజాగా జబీన్‌కు అధికారులు బీసీ ధ్రువీకరణపత్రం మంజూరు చేయడంతో.. ఆయమన పూర్తిస్థాయిలో ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించేందుకు లైన్ క్లియర్ అయ్యింది. దుగ్గిరాల మండల పరిషత్ టీడీపీ ఖాతాలోకి చేరింది.. మొత్తానికి అనుకున్నది సాధించింది టీడీపీ. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ, జనసేనకు కలిపి మెజార్టీ ఉండటంతో ఈ ఎంపీపీ పీఠాన్నికైవసం చేసుకోవడానికి నారా లోకేష్ ప్రయత్నించారు.. కానీ కుదరలేదు. తాజాగా పట్టుబటి మరీ అనుకున్నది సాధించారు.. జబీన్‌కు ఎట్టకేలకు దుగ్గిరాల ఎంపీపీ పదవి దక్కింది.



## రేవంత్-నాగార్జున కెమిస్ట్రీ ఆకట్టుకున్న దృశ్యం



**మహా:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో టాలీవుడ్ పెద్దలు భేటీలో పలు ఆసక్తికర చిత్రాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. టివిలో, సోషల్ మీడియాలో సమావేశ తాలుకు వీడియోలు చూసిన ప్రజలు అసలేం.. జరగలేదా? ఎంత అన్యోన్యంగా ఉన్నారో అనుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, హీరో అక్కినేని నాగార్జున సాన్నిహిత్యం కూడా ముచ్చటగొలిపింది.


ఈ ఏడాది హైదరాబాద్ లో అక్రమ కట్టడాలపై రేవంత్ రెడ్డి సర్కార్ హైడ్రాతో కూల్చివేతలకు దిగింది. నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ ను చెరువును ఆక్రమించి కట్టారని నోటీసులు జారీ చేసిన సర్కార్.. స్పందించే లోపే కూల్చివేతలు చేపట్టింది. దీనిపై నాగార్జున కోర్టుకెళ్లినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. దీనిపై కోర్టులో ఆ తర్వాత నాగార్జున న్యాయపోరాటం చేసినా ఆస్తినష్టం మాత్రం తప్పలేదు. అలాగే ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంలో ఎక్కడా వెనక్కి తగ్గలేదు. సీన్ కట్ చేస్తే ఇవాళ టాలీవుడ్ ప్రముఖులతో రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు నిర్వహించిన భేటీకి అక్కినేని నాగార్జున కూడా ఇండస్ట్రీ పెద్దగా హాజరయ్యారు. నాగార్జున కూడా రేవంత్ రెడ్డిని కలిసి ఈ భేటీ నిర్వహణపై ధన్యవాదాలు చెప్పారు. రేవంత్ కూడా నాగార్జున చేతుల్లో చేతులు వేసి సంతోషంగా కనిపించారు. మొత్తం మీద వీరిద్దరూ ఎన్ కన్వెన్షన్ ఘటన తర్వాత ఇలా కనిపించడం చూపరుల్ని ఆకట్టుకుంది.



## మధ్య తరగతికి బిగ్ రిలీఫ్

- ఆదాయం పన్ను శ్లాబ్‌ల్లో నిర్మలమ్మ మ్యాజిక్
- రూ.15 లక్షల వరకూ నో టాక్స్?

**ఢిల్లీ, మహా:** 202526 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. బడ్జెట్ లో వేతన జీవుల నుంచి వ్యాపారులు, కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌ల వరకూ ప్రతి ఒక్కరూ ఆదాయం పన్నులో మార్పులూ చేర్పులూ ఉంటాయా? అన్న కోణంలో చూస్తూ ఉంటారు. అయితే కేంద్ర ఆర్థిక మంత్రి 2025 26 ఆర్థిక సంవత్సరంలో పట్టణ ప్రాంతాల్లో నివసించే లక్షలాది మంది పన్ను చెల్లింపుదారులకు రిలీఫ్ కల్పించాలని నిర్మలా సీతారామన్ భావిస్తున్నారు. పట్టణాల్లో నివసించే వారికి రూ.15 లక్షల వరకూ పన్ను పరిధి నుంచి మినహాయింపు ఇచ్చే అవకాశం ఉంది. తద్వారా మధ్య తరగతి వర్గానికి ఉపశమనం కల్పించడంతోపాటు వస్తు వినియోగ వృద్ధిని ప్రోత్సహించే అవకాశాలు ఉన్నాయి.






మన్మోహన్ సింగ్‌తో సీఎం రేవంత్ (ఫైల్)

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కన్నుమూత



(మొదటిపేజీ తరువాయి)

భారతదేశానికి 14వ ప్రధానమంత్రిగా పని చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్.. దేశంలో ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా గుర్తింపు పొందారు. పీవీ నరసింహారావు కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ పని చేశారు. ఆ సమయంలో దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేయడంలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారు. ఇక 2004లో నాటి యూపీఏ ప్రభుత్వ హయాంలో మన్మోహన్ సింగ్ దేశ ప్రధానిగా బాధ్యతలు చేట్టారు. దాదాపు దశాబ్దం పాటు ఆయన ఆ పదవిలో కొనసాగారు. మే 22, 2004న ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సింగ్.. మే 26, 2014 వరకు వరుసగా రెండు పర్యాయాలు ఆ పదవిలో బాధ్యతలు చేపట్టారు. మొత్తం 3,656 రోజుల పాటు కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్(UPA) ప్రభుత్వానికి నాయకత్వం వహించి, అత్యధిక కాలం పనిచేసిన మూడో ప్రధానిగా నిలిచారు.

**ఆర్థికరంగంలో తిరుగులేని పట్టు**

సెప్టెంబర్ 26, 1932న పశ్చిమ పంజాబ్‌లోని గాహ్ గ్రామంలో(ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది) జన్మించిన మన్మోహన్ సింగ్.. చండీగఢ్‌లోని పంజాబ్ విశ్వవిద్యాలయం నుంచి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ చేశారు. అలాగే ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. సింగ్ ప్రభుత్వ సేవలో సుదీర్ఘమైన అనుభవం కలిగి ఉన్నారు. ఇందిరా గాంధీ హయాంలో 1971లో విదేశీ వాణిజ్య మంత్రిత్వ శాఖకు ఆర్థిక సలహాదారుగా బాధ్యతలు చేపట్టారు. 1972లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో ముఖ్య ఆర్థిక సలహాదారుగా నియమితులయ్యారు. 1976 వరకు ఆ పదవిలో ఉన్నారు. 19761980 మధ్య మన్మోహన్ సింగ్ అనేక కీలక పదవులు చేపట్టారు. వీటిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డైరెక్టర్‌గా, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ డైరెక్టర్‌గా, మనీలాలోని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో భారతదేశానికి ప్రత్యామ్నాయ గవర్నర్, ఆల్టర్నేట్‌గా ఉన్నారు. ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో భారతదేశానికి గవర్నర్‌గా.. అలాగే ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగా.. అటామిక్ ఎనర్జీ కమిషన్, స్పేస్ కమిషన్ రెండింటిలోనూ సభ్యుడు(ఫైనాన్స్) గా కూడా పదవులు చేపట్టారు మన్మోహన్ సింగ్.

**సీతక్క సంతాపం**

మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ గారి మరణం పట్ల మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దూరదృష్టి గల నాయకుడు, ప్రఖ్యాత ఆర్థిక వేత్త, రాజనీతిజ్ఞుడు, భారతదేశ పురోగతికి ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మన్మోహన్ సింగ్ గారి మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. దేశానికి మన్మోహన్ సింగ్ చేసిన కృషి, దేశ అభివృద్ధిలో ఆయన పాత్ర ఎప్పటికీ గుర్తుండి పోతుందన్నారు. మన్మోహన్ సింగ్ మరణంతో కాంగ్రెస్ పార్టీ ఒక సుశిక్షితుడైన సైనికుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయమే తన నిర్ణయంగా శిరసావహించిన మన్మోహన్ సింగ్ గారు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని మంత్రి సీతక్క గుర్తు చేసుకున్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు హక్కుగా కల్పించిన ఘనత మన్మోహన్ సింగ్ గారికి దక్కుతుందన్నారు. విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం వంటి ఎన్నో చట్టాలు ప్రధాని మన్మోహన్ సింగ్ కాలంలోనే అమల్లోకి వచ్చాయని మంత్రి సీతక్క గుర్తు చేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. మన్మోహన్ సింగ్ గారి చిత్తశుద్ధి, ప్రజాసేవ పట్ల అంకితభావం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఈ విషాద తరుణంలో ఆయన కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు సీతక్క తన సానుభూతి తెలిపారు.

### ఇంట్లో అకస్మాత్తుగా.. అసలేం జరిగింది?

**ఢిల్లీ:** ఇంట్లో అకస్మాత్తుగా స్పృహ కోల్పోయిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ను హుటా హుటిన 8:06 నిమిషాలకు కుటుంబ సభ్యులు ఎయిమ్స్ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. మన్మోహన్ సింగ్ కు అత్యవసర విభాగంలో ఉంచి బ్రతికించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. చికిత్స పొందుతూ అనారోగ్యంతో మృతి చెందినట్లు9:51 నిమిషాలకు ఎయిమ్స్ వైద్యులు ప్రకటించారు. అధికారిక ప్రకటనను ఎయిమ్స్ మీడియా సెల్ ఇంచార్జ్ డా. రిమా దాద విడుదల చేశారు.

### మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు

**కంది శ్రీనివాసరెడ్డి**

**మహా:** మాజీ ఆర్థిక శాఖ మంత్రిగా, మాజీ ప్రధాన మంత్రిగా మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు ఈ దేశం ఏ నాటికి మరిచిపోదని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. మన్మోహన్ సింగ్ మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆకస్మిక మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, నమ్మిన సిద్ధాంతం కోసం క్రమశిక్షణతో జీవితకాలం పనిచేసిన గొప్ప వ్యక్తి అన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర ద్రిగ్బాంతి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ధ్రిగ్బాంతి వ్యక్తం చేశారు. 15 వ లోక్ సభ లో ఆయన ప్రధాని గా నేను లోక్ సభ సభ్యుడిగా ఉన్నప్పుడు ఆయన తో కలిసి అనేక సమావేశాల్లో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ గొప్ప రాజనీతిజ్ఞుడు భారత ఆర్థిక వ్యవస్థలు నిలదొక్కుకోవడానికి ఆయన ఎన్నో సంస్కరణలు చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. 2004 14 మధ్య దేశ ప్రధాని గా ఆయన ఎన్నో సేవలు చేశారని ఉపాధి హామీ , సమాచార హక్కు చట్టం తదితర చట్టాలు తెచ్చి దేశ రూపురేఖలు మార్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేసుకున్నారు. 10 సంవత్సరాలు ప్రధాని గా చేసిన అత్యంత నిరడంబరుడుగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ పాత్ర మరవలేనిది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మరణం పట్ల తీవ్ర ద్రిగ్బాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు .వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## వైఎస్ జగన్ ప్రజాదర్బార్‌కు భారీ స్పందన

**కడప, మహా:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైఎస్సార్ జిల్లా పర్యటనలో భాగంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ దర్బార్ కు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. క్యాంపు ఆఫీసుకు వచ్చిన వారి నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్నారు. జగన్ నాలుగు రోజుల పర్యటనలో భాగంగా పులివెందులలో ఉంటున్న విషయం తెలిసిందే. ప్రజాదర్బార్ కార్యక్రమంలో జగన్‌తో పాటు ఎంపీ అవినాశ్ రెడ్డి కూడా ఉన్నారు. జగన్ క్యాంపు కార్యాలయంలో ప్రజలను కంట్రోల్ చేయలేకపోవడంతో అద్దాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసినట్లు సమాచారం. అక్కడ స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



## అస్వస్థతకు గురైన సోనియా గాంధీ

- కర్ణాటకలోని బెళగావిలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలు
- తల్లి వెంటే ఉన్న ప్రియాంక గాంధీ

**ఢిల్లీ, మహా:** కాంగ్రెస్ పార్టీ మాజీ అధినేత్రి, రాజ్యసభ సభ్యురాలు సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. అస్వస్థత కారణంగా ఆమె కర్ణాటకలోని బెళగావిలో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలకు దూరమయ్యారు. 'నవ సత్యాగ్రహ బైఠక్' పేరిట నిర్వహిస్తున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలకు సీడబ్ల్యూసీ సభ్యులతో పాటు, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులు, రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, మాజీ సీఎంలు, పార్లమెంటరీ పార్టీ ఆఫీస్ బేరర్లు... ఇలా దాదాపు 200 మంది కాంగ్రెస్ నేతలు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. అయితే, సోనియా అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ప్రియాంక గాంధీ తల్లి వెంటే ఉన్నారు. సోనియా కోలుకుంటే ప్రియాంక కూడా ఈ సమావేశాలకు హాజరవుతారని తెలుస్తోంది. కాగా, రాహుల్ గాంధీ ఈ సమావేశాలకు హాజరయ్యారు.

## చాగంటికి కీలక బాధ్యతలు


**ఏపీ ప్రభుత్వం నిర్ణయం**

**పుస్తకాల రూపకల్పన బాధ్యత అప్పగింత.. కేబినెట్‌లో నిర్ణయం**




**అమరావతి,మహా :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. చాగంటి కోటేశ్వరరావును ఇప్పటికే కేబినెట్ హోదాలో సలహాదారు పదవిలో నియమించగా.. తాజా మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. చాగంటి కోటేశ్వరరావుతో ప్రత్యేకంగా పుస్తకాలను రూపొందించాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. చాగంటితో ప్రత్యేక పుస్తకాలను రూపొందించి విద్యార్థులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేబినెట్‌లో తీర్మానం కూడా చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును విద్యార్థులు నైతికత విలువల సలహాదారు పదవిలో కేబినెట్ హోదాతో నియమించిన సంగతి తెలిసందే.ఈ మేరకు ఆయన ఆ పదవిని స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలోనే చాగంటి కోటేశ్వరరావు పూర్తిస్థాయిలో బాధ్యతల్ని స్వీకరించనున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. చాగంటి కోటేశ్వరరావుకు కీలకమైన బాధ్యతలు అప్పగించింది. రెండు రోజుల క్రితం కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఏపీ నైతికత విలువల ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావుతో ప్రత్యేకంగా పుస్తకాలు రూపొందించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ఈ పుస్తకాలను చాగంటితో పుస్తకాలను రూపొందించి పంపిణీ చేయనున్నారు. అంతేకాదు కేజీ నుంచి పీజీ వరకు ఇంటిగ్రేట్ చేస్తూనే.. విద్యార్థులకు విలువలతో కూడిన పాఠ్యప్రణాళిక రూపొందించాలనే మరో నిర్ణయం కూడా తీసుకున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద కిట్లు అందజేయాలని నిర్ణయించారు. రూ.32.45 కోట్ల వ్యయంతో అందించే కిట్లలో టెక్స్ట్ బుక్స్, పోటీ పరీక్షల మెటీరియల్, రికార్డ్ బుక్స్, రాతపుస్తకాలు ఉంటాయి. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ విద్యార్థులకు జనవరి నుంచి మధ్యాహ్న భోజన పథకం పునరుద్ధరణ చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ కాలేజీల్లో విద్యార్థులకు జేఈఈ, నీట్, ఈఏపీసెట్ లపై శిక్షణ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్ ఇవ్వడంతో పాటుగా.. వీటిని బోధించేందుకు ప్రత్యేక సమయం కేటాయించనుంది ప్రభుత్వం.



## తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు: ఛార్మీ

**హైదరాబాద్, మహా:** టాలీవుడ్ సినీ ప్రముఖులతో తెలంగాణ ప్రభుత్వ పెద్దలు సమావేశం కావడం పట్ల ప్రముఖ నటి, నిర్మాత ఛార్మీ కౌర్ స్పందించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ట్వీట్ చేశారు. వారి విజనరీ నాయకత్వం, చిత్ర పరిశ్రమ పట్ల వారి స్థిరమైన నిబద్ధత అభినందనీయమని పేర్కొన్నారు. "ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది. సినీ పరిశ్రమకు, సమాజానికి లబ్ధి చేకూర్చే సంక్షేమ కార్యక్రమాల పట్ల చైతన్యం కలిగించేందుకు మనస్ఫూర్తిగా తోడ్పాటు అందిస్తాను. కీలకమైన సామాజిక సమస్యలపై అవగాహన కలిగించేందుకు కట్టుబడి ఉంటాను. చిత్ర పరిశ్రమ ఉజ్వల భవిష్యత్తుకు కలసికట్టుగా కృషి చేద్దాం" అని ఛార్మీ తన ట్వీట్ లో పేర్కొన్నారు.




## శ్రీతేజ్‌ను పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

**బీఆర్ఎస్ నేత హరీశ్ రావు**

(మొదటిపేజీ తరువాయి)

బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ''శ్రీతేజ్‌కు మెరుగైన వైద్యం అందిస్తున్నట్టు కిమ్స్ డాక్టర్లు చెప్పారు. బాలుడు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. శ్రీతేజ్ తండ్రి భాస్కర్‌కు మనోధైర్యం ఇమ్మని కేసీఆర్ ఆదేశించారు. మృతిచెందిన రేవతి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిని ప్రార్థిస్తున్నాం. సినిమా వాళ్లను భయపెట్టి సీఎం మంచి చేసుకోకూడదు. సంధ్య థియేటర్ ఘటనను ప్రభుత్వం రాజకీయం చేస్తోంది. గురుకులాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను సీఎం పరామర్శించిన సందర్భాలు లేవు. రాష్ట్రంలో ఓ సర్పంచి ఆత్మహత్య చేసుకుంటే.. అందుకు కారణమైన సీఎం తమ్ముడిని ఎందుకు అరెస్టు చేయలేదు? చట్టం అందరికీ సమానమన్న సీఎం.. వాళ్ల తమ్ముడిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు'' అని హరీశ్‌రావు అన్నారు.

## పుష్ప హీరోయిన్ ఆవేదన ప్రభుత్వానికి ఆదర్శం కావాలి

సాధారణంగా ప్రయోజనాత్మమైన సినిమాలు తీస్తే ప్రజలు ఆదరిస్తారు. ఐతే మధ్యమధ్యలో మంచి సందేశాత్మక సినిమాలైనా ఒకో సారి ఆడకపోవడం కారణంగా వాటికి నష్టాలు వస్తూ ఉండడం వల్ల నిర్మాతలు అంతగా ముందుకు రావడంలేదు. కొందరు నిర్మాతలు వందల కోట్లతో భారీ బడ్జెట్లతో చిత్రాలు నిర్మించి, అధికంగా వసూలు చేసే నిమిత్తం ప్రేక్షకులపై భారం వేస్తూ ఆ క్రమంలో బ్లాకులో టికెట్లు అమ్మేందుకు ప్రయత్నిస్తూ, అదే విధంగా ప్రభుత్వాల నుండి ప్రోత్సాహాలు పొందుతూ కూడా ప్రభుత్వం అనుమతితోనే టికెట్ల ధరలు పెంచడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ఒక వైపు వేయి కోట్ల పెట్టుబడి పెట్టి రెండు వేల కోట్ల వసూళ్ళతో విజయం సాధించామని గర్వంతో ప్రకటించుకొనే ఈ భారీ చిత్ర నిర్మాతలకు అసలు ప్రాథమికంగా ప్రభుత్వాలు సహాయం చేయడమేమిటి!! సందేశాత్మక చిత్రాలకు కొంతైనా సహాయం చేయకుండా మొండి చేయి చూపిస్తూ నేర ప్రవృత్తి, హింసాయుత ఇతివృత్తము, అసభ్య వ్యంగ్యార్థ సంభాషణలు కలిగిన సినిమాలను ప్రభుత్వాలెందుకు ప్రోత్సహించాలి. ఆ పైన భారీ చిత్రాల సినిమా హీరోలు రిలీజు సమయంలో రోడ్ షో చేస్తే అమాయక ప్రజలు తోపులాట చేయవచ్చని ముందుగా గ్రహించి రోడ్ షో చేయకుండా ఉండేందుకు చర్యలు



తీసుకోకుండా నిరోధించలేక పోయింది ప్రభుత్వం. ఎర్రచందన అక్రమ రవాణాలు, వాటి విక్రయం అనేవి పూర్తి చట్టవిరుద్ధమైన చర్యలని తెలిసీ, వాటిని కథా వస్తువుగా గ్రహించి, దాని చుట్టూతా యువతని మాయచేసి ఆకర్షించే సంభాషణలు, పాటలు, సీన్ లు, డాన్సులూ అల్లి సాంఘిక బాధ్యతను పక్కనబెట్టి కేవలం ధనార్జనే పరమావధిగా వ్యాపారాలు చేసే బడా నిర్మాతలను ప్రభుత్వాలే టికెట్ ధరల రూపంలో ప్రోత్సహించడం తీవ్రంగా చర్చచేయాల్సిన విషయం. చిత్రంలోని పాటలకున్న సాహిత్యము, వాటిని అభినయించే తీరును స్వయానా హీరోయిన్ ఐన రష్మికయే ప్రశ్నించి, నిర్మాత వత్తిడి కారణంగా తప్పని స్థితిలో చేశానని అంగీకరించి ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందే. పుష్ప హీరోయిన్ ఆవేదన ప్రభుత్వానికి ఆదర్శం కావాలి.

**- నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి**

EDITORIAL ఎడిటోరియల్






# బెళగావిలో కాంగ్రెస్

**హైదరాబాద్, మహా:** ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై సందేహాలు తలెత్తుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆరోపించారు. మోదీ సర్కారు వైఖరే అందుకు కారణమన్న ఆయన, రాజ్యాంగ సంస్థలన్నింటినీ తన గుప్పెట్లో పెట్టుకునేందుకు యత్నిస్తోందని విమర్శించారు. జవహర్‌లాల్ నెహ్రూ, గాంధీ సిద్ధాంతాలు, బీఆర్ అంబేడ్కర్ గౌరవం కోస చివరి శ్వాస వరకు కాంగ్రెస్ పోరాడుతుందని గురువారం బెళగావిలో జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశంలో స్పష్టం చేశారు. త్వరలోనే పార్టీ పదవులన్నింటినీ భర్తీ చేస్తామని ప్రకటించారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి అయిన వర్కింగ్ కమిటీ కర్ణాటక బెళగావిలో ప్రత్యేకంగా సమావేశమైంది. బెళగావిలో జరిగిన కార్యక్రమంలోనే మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించగా అదేచోట నవ సత్యాగ్రహ బైఠక్ పేరుతో తాజా సమావేశాన్ని ఆ పార్టీ అధినాయకత్వం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, తెంగాణ సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇతర సీనియర్ నేతలు హాజరయ్యారు. అనారోగ్యం కారణంగా సోనియా గాంధీ ఈ సమావేశానికి రాలేదు. వీడియో రూపంలో తన సందేశాన్ని పంపారు. వచ్చే ఏడాది రాజకీయంగా, ఎన్నికల పరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమాలోచనలు జరిపింది.

## ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం పోతోంది

సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఉద్దేశించి ప్రారంభ ఉపన్యాసం చేసిన ఖర్గే రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌పై ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. అమిత్ షా అంబేద్కర్‌ను అవమానించేలా మాట్లాడినప్పటికీ ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం తప్పును ఒప్పుకునే స్థితిలో లేరని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత గౌరవం కోసం పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. రాజ్యాంగ సంస్థలను సైతం మోదీ సర్కారు నియంత్రిస్తోందని ఆరోపించిన ఖర్గే, అందుకు ఎన్నికల సంఘమే ఉదాహరణ అని పేర్కొన్నారు. మోదీ సర్కార్ వైఖరి కారణంగా ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లుతోందని ఖర్గే ఆరోపించారు.

## కష్టపడడం మాత్రమే సరిపోదు : ఖర్గే

ఓటరు జాబితాలో పేర్లు ఇష్టారీతిన తొలగించడం, చేర్చడం., పోలింగ్ శాతం ఒక్కసారిగా పెంచడం వంటి అనేక ప్రశ్నలకు ఈసీ సంతృప్తికరమైన సమాధానం చెప్పడం లేదని మల్లికార్జున ఖర్గే విమర్శించారు. 2025లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్న ఖర్గే పార్టీపరంగా ఖాళీలన్నింటినీ భర్తీచేస్తామని ప్రకటించారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసేవారిని గుర్తిస్తామన్న ఆయన వారికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. కష్టపడి పనిచేయడం మాత్రమే సరిపోదన్న ఖర్గే సమయానుకూలంగా నిర్మాణాత్మక వ్యూహరచన, దిశానిర్దేశం కూడా అవసరమేనని పేర్కొన్నారు.

## గాంధీ హంతకులను కీర్తించారు
### సోనియా గాంధీ

“ సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఉద్దేశించి సందేశం పంపిన మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, మహాత్మాగాంధీ ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్నవారు మహాత్ముడి వారసత్వం, సిద్ధాంతాలను ప్రమాదంలో పడేశారని ఆమె ఆరోపించారు. వాటిని పరిరక్షించేందుకు కాంగ్రెస్ శ్రేణులంతా పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు దేశ స్వాతంత్ర్యం కోసం ఏనాడూ పోరాడలేదన్న ఆమె మహాత్మాగాంధీని తీవ్రంగా వ్యతిరేకించాయని పేర్కొన్నారు. ఆయా సంస్థలు అప్పటి వాతావరణాన్ని కలుషితం చేయడం వల్లే గాంధీజీ హత్యకు దారితీసిందన్నారు. పైగా గాంధీ హంతకులను కీర్తించారని విమర్శించారు. ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు పార్టీ సంస్థాగతంగా బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.







“

# కాంగ్రెస్‌కు ఊపిరిపోసిన ఏడాది

**ఎన్నికల్లో జోష్.. గాంధీ కుటుంబానికి వెరీవెరీ స్పెషల్..రీల్ - 2024**



**ఈ ఏడాది కాంగ్రెస్ కు చాలా ఏళ్ళు గుర్తుండే ఏడాది. కాంగ్రెస్ ఈ ఏడాది బాగా పుంజుకుంది. ఎన్డీఏకు ముచ్చుమటలు పట్టించి అధికారపీఠానికి చేరువైంది. లోక్ సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ బాధ్యతలు తీసుకుంది ఈఏడాదే. ప్రియాంకగాంధీ తొలిసారి చట్టసభలో అడుగుపెట్టింది ఈ ఏడాదే. అందుకే 2024 కాంగ్రెస్ కు వెరీవెరీ స్పెషల్.**

2014 ఎన్నికల్లో కేంద్రంలో ఓటమి తర్వాత పూర్తిగా కుందేలైన కాంగ్రెస్ పార్టీకి ఈ ఏడాది మాత్రం ఊపిరి పోసింది. కొత్త జోష్ వచ్చింది. పదేళ్ల విరామం తర్వాత లోక్ సభ ఎన్నికల్లో భారీ విజయాలతో పార్లమెంట్ లో ఉనికి చాటుకోవడంతో పాటు విపక్ష నేతగా రాహుల్ గాంధీ ఎంపిక కావడం, ఒకేసారి పార్లమెంట్ లో ముగ్గురు గాంధీల ప్రాతినిధ్యం కనిపిస్తుండటం.. ఇలా ఎటు చూసినా ఈ ఏడాది కాంగ్రెస్ పార్టీకి బాగా కలిసి వచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఈ ఏడాది సాధించిన విజయాలను ఓసారి చూద్దాం. కాంగ్రెస్ ముక్త్ భారత్ తెస్తామంటూ కేంద్రంలో ఒకప్పుడు బీరాలు పలికిన ప్రధాని మోడీ, అమిత్ షాలకు ఈ ఏడాది బిగ్ షాక్ ఇచ్చింది. లోక్ సభ ఎన్నికల్లో ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన కాంగ్రెస్ పార్టీ .. ఇండియా కూటమిలోని మిత్రులతో కలిసి బీజేపీని పలుచోట్ల మట్టికరిపించింది. కీలకమైన యూపీలో సగానికి పైగా ఎంపీ సీట్లను కైవసం చేసుకోవడంతో పాటు తన పాత కంచుకోటలు అమేథీ, రాయ్ బరేలీ సహా పలు చోట్ల సత్తా చాటుకుంది. రాహుల్ గాంధీ పోటీ చేసిన రెండు సీట్లు రాయ్ బరేలీ, వాయనాడ్ లోనూ ఘన విజయాలు సాధించారు. దీంతో ఇండియా కూటమి నాయకుడిగా విపక్ష నేతగా మారారు.

**బలమైన ప్రతిపక్షం**

దీంతో ఇప్పుడు పార్లమెంట్ చరిత్రలోనే ఎప్పుడూ లేనంత బలమైన ప్రతిపక్షంగా ఇండియా కూటమిని మార్చడంలో కాంగ్రెస్ వ్యూహం సక్సెస్ అయింది. అంతే కాదు కాంగ్రెస్ నుంచి తొలిసారి ముగ్గురు గాంధీలు రాహుల్, ప్రియాంక, సోనియా తొలిసారి పార్లమెంట్ లో ఉన్నారు. రాహుల్ రాయ్ బరేలీతో పాటు వాయనాడ్ లోనూ గెలిచిన నేపథ్యంలో వాయనాడ్ ను వదులుకుని ఉప ఎన్నికల్లో చెల్లెలు ప్రియాంకను గెలిపించుకున్నారు. అలాగే రాయ్ బరేలీని వదిలేసిన సోనియా గాంధీ రాజ్యసభ ఎంపీగా మారారు. దీంతో పార్లమెంట్ ఉభయసభల్లోనూ గాంధీల ప్రాతినిధ్యం కనిపిస్తోంది. ఇది కాంగ్రెస్ శ్రేణులకు బిగ్ బూస్ట్ గా మారింది. ఇప్పుడు కాంగ్రెస్ ను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం జమిలి సహా ఏ కీలక నిర్ణయం తీసుకునే పరిస్థితి లేదు. మరోవైపు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా, మిత్రపక్షాలతో కలిసి పోటీ చేసినా ఫలితం దక్కలేదు. అయితే జమ్మూ కాశ్మీర్, జార్ఖండ్ లో మాత్రం ఇండియా కూటమి మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. కొన్ని రాష్ట్రాల్లో అంచనాలు అందుకోలేకున్నా.. బిజెపికి ప్రత్యామ్నాయం కాంగ్రెస్సేనని, అది ఎంతోదూరంలోలేదన్న ఆశలను 2024 కల్పించింది.

## ఆర్థిక అసామాన్యుడు
# మన్మోహన్ సింగ్



**మహా:** పదవిని చేపట్టడం సాధారణమే.. కానీ, ఆ పదవికే వన్నె తెచ్చేలా పాలన అందించడం ఓ చరిత్ర. అటువంటి ఘనతను సొంతం చేసుకున్న వ్యక్తుల్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఒకరు. భవిష్యత్ ను ముందుగానే అంచనా వేసి వినూత్న నిర్ణయాలతో పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలకు మన్మోహన్ సింగ్ పెద్దరికం తీసుకువచ్చారు. ఆర్థిక సమస్యలతో అల్లాడుతున్న భారతదేశానికి నూతన సంస్కరణలను పరిచయం చేసి ఇండియాను మనీ ఇంధనంగా మార్చారు.

## ఫ్యాకల్టీ నుంచి ప్రధాని వరకు..

పంజాబ్ రాష్ట్రంలో 1932 సెప్టెంబర్ 26న జన్మించిన ఆయన ఎకనామిక్స్ లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఆయన ఎడ్యుకేషన్ కు సంబంధించిన ప్రయాణం పంజాబ్ నుంచి బ్రిటన్ లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ, అక్కడి నుంచి ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ వరకు కొనసాగింది. ఫ్యాకల్టీగా పనిచేసి పంజాబ్ యూనివర్సిటీ గొప్పతనం నలుదిశలా వికసించేలా కృషి చేశారు. అత్యంత ప్రతిష్టాత్మక ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకానామిక్స్ లోనూ ఆయన అద్భుతంగా రాణించారు. విద్యాభివృద్ధికి ఇంతలా కృషిచేస్తున్న మన్మోహన్ సింగ్ కు 1971లో వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆర్థిక సలహాదారుగా పనిచేసే అవకాశం దక్కింది. మన్మోహన్ పనితీరును గమనించిన ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రత్యేకంగా ఆహ్వానించి, ప్రధాన ఆర్థిక సలహాదారుగా నియమించింది. ఆ తరువాత ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్ గా, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ గా, ప్రధాన మంత్రి సలహాదారుగా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిటీ చైర్మన్ పదవులలో మన్మోహన్ సింగ్ ఎంతో నియమనిబద్ధతో పనిచేశారు. ఎన్నో మార్పులు తీసుకొచ్చారు. దేశం ఎకానమీని అభివృద్ధి పరచడంలో వినూత్న నిర్ణయాలు తీసుకున్నారు.

## రాజకీయాల్లోనూ హుందాతనం

1991 నుంచి రాజ్యసభ సభ్యునిగా కొనసాగారు. 1998 2004 మధ్య మన్మోహన్ సింగ్ ప్రతిపక్ష నేతగానూ కొనసాగారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కేబినెట్ లో మన్మోహన్ సింగ్ ఆర్థిక శాఖ మంత్రిగా కొనసాగారు. ఆ సమయంలో దేశం ఆర్థిక పురోగమనానికి ఎంతో కీలకంగా పనిచేశారు. నూతన సంస్కరణలు తీసుకువచ్చి ఇండియా ఎకానమీని పరుగులు పెట్టించారు. దీంతో భారతదేశంలో పేదరికం నుంచి చాలావరకు బయటపడి ఇతర దేశాలతో పోటీ పడగలిగింది. 2004 2014 వరకు ప్రధానిగా పనిచేసి పాలనలోనూ తనదైన ముద్ర వేశారు. వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రతిపక్షాలు సైతం మన్మోహన్ సింగ్ ఎంతో సౌమ్యుడు అంటూ కీర్తించాయి. ఆయనకు అధికారాన్ని అప్పజెప్పిన ప్రజలు, పార్టీ సైతం పూర్తి సంతృప్తిని తెలియజేశారు. పార్లమెంటులో మన్మోహన్ సింగ్ ఆదర్శప్రాయంగా ప్రసంగించేవారు. దేశ ఆర్థిక అభివృద్ధిపై బలమైన ముద్ర వేసిన మాజీ ప్రధాని, భారతీయుల జీవితాలు మెరుగుపడేందుకు ఎంతో కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డును అందజేసింది. జవహర్ లాల్ నెహ్రూ బర్త్ సెంటినరీ అవార్డ్ ఆఫ్ ది ఇండియన్ కాంగ్రెస్, జపాన్ కు చెందిన నిహాన్ కిజై షింబన్ తో సహా పలు అవార్డులను మన్మోహన్ సింగ్ అందుకున్నారు. అదేవిధంగా కేంబ్రిడ్జ్, ఆక్స్ ఫర్డ్ తోపాటు అనేక యూనివర్సిటీలు ఆయనకు గౌరవ డాక్టరేట్లను అందించాయి. తన పనితీరు, పాలనతో ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచారు.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా: editor@mahaadaily.com | whatsapp- 7436939999

ANN తెలుగు
మహా పత్రిక 05
శుక్రవారం, హైదరాబాద్ | 27-12-2024 | జిల్లా వార్తలు | DISTRICT NEWS
WWW.MAHAADAILY.COM

# ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు




**ఆదిలాబాద్, మహా:** అనేక సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటాలు చేస్తోందని, ఎన్నో ప్రజా ఉద్యమాలు చేపట్టి విజయాలు సాధించిన చరిత్ర కమ్యూనిస్ట్ పార్టీకి ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన వీధుల్లో నాయకులు, కార్యకర్తలు వేర్వేరుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.... దతాబ్ది కాలంలో చేసిన త్యాగాలు, పోరాటాలను నేటి తరానికి తెలియజెప్పేలా సీపీఐ ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. గ్రామగ్రామాన వేడుకలను జరుపుతున్నామని, జెండాలను ఎగరేస్తున్నామని తెలిపారు. భారత స్వాతంత్ర ఉద్యమంలో కమ్యూనిస్ట్ పార్టీ కీలక భూమిక పోషించిందన్నారు. దేశంలోని సంపద రక్షణకు, రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతోందన్నారు. అటు సీపీఐ జిల్లా నాయకుడు సిర్ర దేవేందర్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జెండాను ఆవిష్కరించి పాత తరం నాయకుల పోరాటాలను కొనియాడుతూ వారిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉమ్మడి జిల్లా మాజీ కార్యదర్శి నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, అరుణ్ కుమార్, చిల్కా దేవిదాస్, మెస్రం భాస్కర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బాత్తుల గంగారెడ్డి, గేడం కేశవ్, ఉస్మాన్, కళ్లెపెల్లి గంగయ్య, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గేడం పొచ్చిరాం, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు తబ్రేజ్, సీనియర్ నాయకులు కట్ట కిష్టయ్య, వెంకటస్వామి, గణపతి, గజ్జరాం, వసంత్, రాంరెడ్డి, బత్తుల రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వ శాంతి మహాయాగం.. ఆధ్యాత్మిక సౌరభం







**ఆదిలాబాద్, మహా:** శాస్త్రంలో చెప్పిన నియమాలను పాటిస్తూ జీవనం సాగించాలని, తోటివారితో స్నేహపూర్వకంగా మెలుగుతూ ధర్మ కార్యాలు నిర్వహించాలని, ప్రతివారి పట్ల సహృద్భావంతో ఉండాలని, అదే నిజమైన సనాతన ధర్మమని శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ చైతన్య స్వరూపానంద స్వామి అన్నారు. ప్రతిఒక్కరూ ఈ పద్ధతులను ఆచరిస్తే వారికి తప్పకుండా మోక్షం కలుగుతుందని, పుణ్యఫలం లభిస్తుందని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కాలేజీ మైదానంలో డిసెంబర్ 22 నుండి జనవరి 6 తేదీ వరకు విశ్వశాంతి మహాయాగం నిర్వహిస్తున్నారు. సృష్టిలో పాప కర్మములు, రోగములు, మానసిక రుగ్మతలను తొలగించి, పాడి పంటలను అభివృద్ధి పరిచి, అష్టఐశ్వర్యాలను ప్రసాదించి మోక్ష ప్రాప్తి కలిగించేదే యాగ పుణ్యఫలమని ప్రబోధించారు. భక్తజనులందరూ ఆ భగవంతుడి సేవలో భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలని సందేశమిచ్చారు. శ్రీ వైష్ణవ ఆయుత చండీయాగంతోపాటు చతుర్వేదాల హవనములు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భక్తి ప్రవచనాలు, ప్రతిరోజు సాయంత్రం వివిధ దేవతా కళ్యాణోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులకు ఉదయం రాత్రి అల్పాహారాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతున్నట్టు వివరించారు. లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి భగవంతుని కృపకు పాత్రులు కాగలరని స్వామీజీ కోరారు.

# చెత్త బండిలో శిశువు మృత దేహం

**నిర్మల్, మహా:** నిర్మల్ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. మున్సిపల్ చెత్త బండిలో నవజాత శిశువు మృత దేహం లభ్యమైంది. ఈ ఘటన గురువారం స్థానికంగా కలకలం రేపింది. మున్సిపల్ కార్మికులు ఎప్పటి మాదిరిగానే చెత్తను సేకరించి జిల్లా కేంద్రంలోని డంపింగ్ యార్డ్‌కు తరలించే క్రమంలో మార్గ మధ్యలో ఓ కవర్ కింద పడింది. దీన్ని గమనించిన సదరు బల్దియా కార్మికులు కవర్ తీసి చూసేసరికి అందులో నవజాత శిశువు మృతదేహం కనిపించింది. దీంతో వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి భూమి పూజ



**ములుగు, మహా:** విశ్వబ్రాహ్మణుల ఆరాధ్యదైవం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి ములుగులో భూమిపూజ నిర్వహించారు. గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్కతుర్తి రాజన్న ఆధ్వర్యంలో నూతన పోలీస్ స్టేషన్ సమీపంలో ఆలయ నిర్మాణ పనులకు అంకురార్పణ జరిగింది. కాలజ్ఞానిగా పేరుగాంచిన వీరబ్రహ్మేంద్రునికి ఆలయాన్ని నిర్మించేందుకు జిల్లాలోని ప్రజలందరూ సహకరించాలని రాజన్న కోరారు. భూమిపూజా కార్యక్రమంలో వేదపండుతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణులు జంటలుగా వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని, ప్రతీ ఒక్కరూ తమ సహాయ సహకారాలు అందించాలని రాజన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బస్వోజు మహేష్, కడివెండి వీరాచారి, కాగితపు శ్రీనివాస్, రేసోజు శ్రీధర్, జ్ఞానేశ్వర్, రాపాక రమేష్, శ్రీలమంతుల నర్సింహాచారి, మొగులోజు రమేష్, కందోజు భవన్నారాయణ, రుద్రోజు ఆనంద్, వంశీ, రమేష్, ఎల్కతుర్తి శ్రీహరి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు ఊడ్చి నిరసన

**సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్**




**ములుగు, మహా:** రాష్ట్రంలో విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ములుగులోని కలెక్టరేట్ సమీపంలో రోడ్లు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని, నిరవధిక దీక్ష 17రోజులు పూర్తయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా సమగ్ర శిక్ష ఉద్యోగుల జీవితాలు మారకపోవడం దురదృష్టకరమన్నారు. విద్యార్థులకు పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో వెంటనే తగిన నిర్ణయం తీసుకోవాలని, సీఎం రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, కోశాధికారి కుమార్ పాడియా, మహిళ అధ్యక్షురాలు కె.జీవనప్రియ, ఉపాధ్యక్షుడు ఎండీ ఫిరోజ్, సభ్యులు సుజాత, రాజేశ్వరి, జయ వసంతలక్ష్మి, అశ్విని, సుజాత, అరుణ, భాగ్యలక్ష్మి, పుష్పనీల, ప్రవీణ్, రమణి, రమేష్, సుబ్బారెడ్డి, తిరుమల, స్వప్న, గంగాధర్, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ముగిసిన

# ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ పర్యటన

**వీడ్కోలు పలికిన గవర్నర్ జిష్ణుదేవ్, మంత్రి జూపల్లి**



**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 26, మహా:** తెలంగాణలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ పర్యటన నేటితో ముగిసింది. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ఆయన సతీమణి సుదేష్ ధన్కర్ లకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ప్రొటోకాల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకట్రావు, రాష్ట్ర డీజీపీ జితేందర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, తదితరులు వీడ్కోలు పలికారు. కాగా బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న ఉప రాష్ట్రపతి దంపతుల రెండు రోజుల పర్యటనను ముగించుకొని తిరిగి ఢిల్లీకి వెళ్లారు.

## గొప్ప ఆర్థిక సంస్కర్తను జాతి కోల్పోయింది

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హైదరాబాద్, మహా:** మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని, గొప్ప ఆర్థిక సంస్కర్తను జాతి కోల్పోయిందంటూ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపట్ల ఆయన సంతాపం తెలియజేశారు. 'మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు దేశం ఏ నాటికి మరిచిపోదు. దేశం ఆర్థికంగా అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు తన ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేశారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో అనేక విప్లవాత్మకమైన చట్టాలు తెచ్చి అమలు చేసిన గొప్ప రాజనీతిగల నేత. ఆయన మరణం దేశానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## డీఎంకేను గద్దెదించే వరకు

# పాదరక్షలు ధరించను

**భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై**



**మహా, తమిళనాడు:** అత్యాచార ఘటన తమిళనాడులో ప్రకంపనలు సృష్టిస్తోంది. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపుతప్పిపోయాయని, దీనికి అధికార డీఎంకే ప్రభుత్వమే కారణమని భాజపా విమర్శలు గుప్పిస్తోంది. ఈ క్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై భీష్మ ప్రతిజ్ఞ చేశారు. డీఎంకే అధికారం కోల్పోయేంత వరకు తాను పాదరక్షలు ధరించబోనని ప్రతినబూనారు. గురువారం కోయంబత్తూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు నేను పాదరక్షలు ధరించను. చెప్పులు లేకుండానే నడుస్తా. ఎన్నికల్లో విజయం సాధించడానికి ఎప్పటిలాగే డబ్బులు ఎరగా చూపం. రూపాయి కూడా పంచకుండా ఎన్నికలకు వెళ్తాం. ఎన్నికల్లో విజయం సాధించేంత వరకు చెప్పులు ధరించను'' అని అన్నామలై అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో చెడు అంతమైపోవాలని కోరుతూ కోయంబత్తూరులోని తన నివాసంలో ఆరు కొరడా దెబ్బలు భరించి... మురుగన్‌కు మొక్కు చెల్లించుకుంటానని అన్నారు. రాష్ట్రంలోని ఆరు మురుగన్ క్షేత్రాలను దర్శించుకునేందుకు 48 గంటలపాటు ఉపవాస దీక్ష చేపడతానన్నారు.

## మతరాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలి

**సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్..ములుగులో ర్యాలీ**




**ములుగు, మహా:** దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, మత రాజకీయాలకు వ్యతిరేకంగా సమరశీల ఉద్యమాలకు ప్రతీ ఒక్కరూ సిద్ధం కావాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. సీపీఐ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ములుగులో జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. వందేళ్ల సీపీఐ చరిత్రలో పోరాటాలు చేసిందని, ఎన్నో విజయాలు సాధించిందన్నారు. 1925లో ప్రారంభమైన పార్టీ నేతలు స్వాతంత్ర్య పోరాటం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు భాగస్వాములయ్యారన్నారు. ఎంతోమంది త్యాగాలు చేశారని, అధికారంలో లేకున్నా పదవులు లేకున్నా ప్రజల కోసం ఉద్యమాలు చేశామన్నారు. కార్మిక, కర్షక, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ, శాస్త్ర సాంకేతిక రంగాల తరపున ప్రజా సంక్షేమం కోసం కృషి చేయడం జరిగిందనీ రవీందర్ పేర్కొన్నారు. మార్క్సిజం మూల సూత్రాలతో ఎప్పటికైనా సమసమాజం స్థాపన, భారత్ లో సోషలిజం అమలుకోసం సీపీఐ కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా వందేళ్ల చరిత్రలో త్యాగధనులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ అమ్జద్ పాషా, మండల కార్యదర్శులు ముత్యాల రాజు, బండి నర్సయ్య, వడి సారయ్య, బండారి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇంజం కొమురయ్య, జక్కుల అయిలయ్య, ప్రజాసంఘాల నాయకులు కొక్కుల రాజేందర్, తనుగుల రాజు, దాసరి సరోజన, జనగాం రజిత, లావుడ్య రామన్న, మర్రి స్వామి, రవి, తోట సంపత్, రొంటాల రమేష్, ఇనుముల భిక్షపతి, రఘు, పైడి, జక్కుల రాజు, దురిశెట్టి కిష్టయ్య, వడి సంపత్, నాగరాజు, మొగిలి శంకర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

**ఉత్సవాల్లో పాల్గొన్న జాతీయ నాయకులు**




**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 26, మహా:** సోషలిస్టు సమాజం కోసం, పీడిత వర్గాల అభ్యున్నతి కోసం సమ సమాజ నిర్మాణం కోసం 1925, డిసెంబర్ 26 తారీఖున ఉత్తరప్రదేశ్ కాన్పూర్ పట్టణంలో కొద్ది మందితో ఏర్పడ్డ వామపక్ష ఎర్రజెండా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి, జాతీయ సమితి సభ్యులు కామ్రేడ్ పల్లా వెంక రెడ్డిలు అన్నారు. సీపీఐ పార్టీ స్థాపించి 100ఏళ్ల సందర్భంగా అబ్దుల్లాపూర్మెట్ మండల సమితి ఆధ్వర్యంలో పెద్ద అంబర్ పేట్ నగరంలో వేలాదిమంది కార్యకర్తలతో నేషనల్ హైవేపై ర్యాలీ చేసి భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ నిరంకుశ పాలన నుంచి 1917 కమ్యూనిస్టు సోషలిస్టు విప్లవం ద్వారా విముక్తి పొంది, సుమారు 14 దేశాలను ఆదర్శంగా తస్కెంట్ నగరంలో 1920 సంవత్సరంలో తొలిసారిగా సమావేశమై తీర్మానం చేసి 1925లో భారత కమ్యూనిస్టు పార్టీని నిర్మించారన్నారు. నాటినుండి నేటి వరకు ప్రజలను సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యవంతులు చేసేలా, తాడిత పీడిత అణగారిన వర్గ ప్రజల కోసం అహర్నిషలు ఉద్యమిస్తున్న నిజమైన కమ్యూనిస్టు పార్టీ అని గుర్తుచేశారు. బ్రిటీష్ పాలన నుంచి భారతదేశాన్ని విముక్తి కోసం ఎంతోమంది కమ్యూనిస్టు నాయకులు అమరయ్యారని, దేశంలోని అసమానతలు రూపుమాపేందుకు, కుల, మత, లింగ వివక్షకు వ్యతిరేకంగా, ప్రతి భారతీయుని అభ్యున్నతి కోసం పోరాడుతున్న నిజమైన భారత రాజకీయ విప్లవ పార్టీ సీపీఐ అని కొనియాడారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణలో భూమికోసం, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం సుమారు 4500 మంది కమ్యూనిస్టు నాయకులు ఆత్మబలిదానాలు చేసి, సుమారు పది లక్షల వేల ఎకరాల భూమిని పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదన్నారు. తెలంగాణ వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, రేవంత్ సర్కారు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల యాదిరెడ్డి, పబ్బతి లక్ష్మణ్, ఈటి నరసింహ, పాలమాకుల జంగయ్య, ఆందోజు రవీంద్ర చారి, పల్లె నర్సింహ, కోందిగారి రాములు, పానుగంటి పర్వతాలు, సామిటి శేఖర్ రెడ్డి, అజ్మీర్ హరిసింగ్ నాయక్, వేణుగోపాల్ చారి, కాటి అరుణ, పట్టినవనీత, కేతరాజు నరసింహ, తగిలి మధు, ఏశాల నరసింహ, దాసరి ప్రసాద్, పొన్నాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# మన్మోహన్ సింగ్ నేటి యువతరానికి ఆదర్శం

**మాజీ ప్రధాని మృతి పట్ల కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంతాపం**

భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ మన్మోహన్ సింగ్ పరమపదించారని తెలిసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. 'గత కొంతకాలంగా వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్న డాక్టర్ మన్మోహన్ ఢిల్లీ ఏయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కాసేపటి క్రితం కన్నుమూశారని తెలిసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ గా, ప్రణాళికా సంఘంలో కీలక బాధ్యతల్లో, యూజీసీ చైర్మన్ గా, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఆయన దేశానికి వన్నెతీసుకొచ్చారు. పీవీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు, దేశ ఆర్థిక మంత్రిగా.. దేశంలో సంస్కరణలు తీసుకురావడంలో వారు పోషించిన పాత్రను దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది. మన్మోహన్ సింగ్ యువతరానికి ఆదర్శం. మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు. నిరాడంబర జీవితం, దేశం పట్ల ఆయన అంకిత భావం భావితరాలకు స్ఫూర్తి దాయకం' అంటూ కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## బీజేపీ ఎమ్మెల్యేపై కోడిగుడ్డు దాడి



**బెంగళూరు:** కర్ణాటకకు చెందిన మాజీ మంత్రి, రాజరాజేశ్వరి నగర్ ఎమ్మెల్యే మునిరత్న నాయుడిపై కొందరూ గుర్తుతెలియని వ్యక్తులు కోడిగుడ్లతో దాడి చేశారు. అత్యాచారం కేసులో అరెస్ట్ అయ్యి మునిరత్న బెయిల్ మీద బయటకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక లక్ష్మీనగర్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో మునిరత్న పాల్గోన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న తరువాత మునిరత్నం తిరిగి వెళుతుండగా.. కొందరు వ్యక్తులు అతడిపై గుడ్లతో దాడి చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి. మరోవైపు ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మునిరత్న స్పందిస్తూ.. కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అతని తమ్ముడు తనని చంపడానికి కుట్ర పన్నారంటూ ఆయన ఆరోపించాడు.

# ఉత్తరాది రాష్ట్రాల్లో మంచు వర్షం

## దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు.. తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలు

## పలు ప్రాంతాల్లో రహదారులు మూసివేత

**హిమాచల్ ప్రదేశ్:** చలి తీవ్రతకు ఉత్తర భారతం గజగజ వణుకుతుంది. జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ సహా ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు రోజురోజుకు దారుణంగా పడిపోతున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌ను మంచు దుప్పటి కప్పేసింది. ఎడతెరిపి లేకుండా మంచు వర్షం కురుస్తుండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్లపై అడుగుల మేర మంచు పేరుకుపోయింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా రహదారులను తాత్కాలికంగా మూసివేశారు.



హిమాచల్ ప్రదేశ్‌లో ఇప్పటివరకు మూడు జాతీయ రహదారులు సహా మొత్తం 226 రోడ్లను మూసివేశారు. ఇందులో సిమ్లాలో 123 రోడ్లు, లాహౌల్, స్పితిలో 36, కులులో 25 రోడ్లు ఉన్నాయి. 173 ట్రాన్స్‌ఫార్మర్‌లకు అంతరాయం ఏర్పడడంతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో తీవ్రమైన చలి పరిస్థితుల కారణంగా భారత వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్‌ను సైతం జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దట్టమైన పొగమంచు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఇటు ఉత్తరాఖండ్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. డెహ్రాడూన్‌లో మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో ధరణాధర్‌కోటి కనసర్ రహదారి, త్యునిచక్రతా ముస్సోరీ జాతీయ రహదారి పూర్తిగా మంచుతో కప్పుకుపోయింది. జమ్మూ కాశ్మీర్‌లోని పలు ప్రదేశాలు చలికి వణికిపోతున్నాయి. శ్రీనగర్‌లో మైనస్ 7 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు భారత వాతావరణ విభాగం తెలిపింది. రానున్న రెండు రోజుల్లో ఇది మరో 2 నుంచి 3 డిగ్రీల వరకూ తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది.



## అయిదుగురు జర్నలిస్టులు మృతి!


**గాజా:** గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయిల్ దాడి చేసింది. నుసైరత్ ఏరియాలో అటాక్ కు పాల్పడింది. ఆ ఘటనలో అయిదుగురు జర్నలిస్టులు మృతిచెందారు. వాహనంలో ప్రయాణిస్తున్న వారిపై ఇజ్రాయిల్ దాడి చేసింది. అల్ అవద్ ఆస్పత్రి గేట్ల వద్ద బాంబు దాడి జరిగింది. ఎరుపు రంగు అక్షరాలతో ప్రెస్ అని రాసి ఉన్న వాహనంపై అటాక్ జరపడంతో పాలస్తీనా ఛానల్ అల్ కుద్స్ టుడేకు చెందిన జర్నలిస్టులు ఆ వాహనంలో ఉన్నట్లు సమాచారం. వాహనం పూర్తిగా ధ్వంసమైన ఫొటోను రిలీజ్ చేశారు. దానిపై ప్రెస్ అని రాసి ఉన్న ఆధారంగా ఆ వాహనంలో ఉన్న వారు జర్నలిస్టులని అంచనాకు వచ్చారు.

## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత

**ఇంఫాల్:** మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. కంగ్‌పోక్పీ జిల్లాలోని సినమ్‌కోమ్ గ్రామంలో ఉదయం 6.30 గంటల సమయంలో దుండగులు కాల్పులు జరిపారు. కొండ ప్రాంతంలో విలేజ్ వాలంటీర్స్ పేరుతో కొందరు బాంబు దాడులకు పాల్పడుతూ కాల్పులు జరిపారని స్థానికులు తెలిపారు. దీంతో హుటాహుటిన భద్రతా బలగాలు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేశాయి. ఇదిలా ఉంటే.. చురాచంద్‌పూర్ జిల్లా లెయిసంగ్ గ్రామంలోని బ్రిడ్జి కింద దుండగులు అమర్చిన 3.6 కేజీల పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.



## క్రిస్మస్ వేళ ఉక్రెయిన్ పై రష్యా భీకర దాడులు



క్రిస్మస్ పండుగ వేళ ఉక్రెయిన్ ఇంధన వ్యవస్థ విధ్వంసమే లక్ష్యంగా రష్యా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. దీంతో కీవి రిహ్, ఖార్కివ్ పట్టణాల్లోని నివాస ప్రాంతాలపై క్రూయిజ్, ఖండాంతర క్షిపణులను కురిపించిండంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయినట్లు వార్తా కథనాలు వెల్లడవుతున్నాయి. బుధవారం ఉదయం ఉక్రెయిన్‌పై గగనతల దాడులు జరుగుతాయని హెచ్చరించే సైరన్‌లు మోగాయి. వెంటనే రష్యా నల్ల సముద్రం నుంచి కాలిబర్ క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించింది. తమ ఇంధన వ్యవస్థపై రష్యా పెద్దఎత్తున దాడులు మళ్లీ ప్రారంభించిందని ఉక్రెయిన్ ఇంధన శాఖ మంత్రి జర్మన్ గలుషెంకో టెలిగ్రామ్ ద్వారా తెలిపారు. సెంట్రల్ ఉక్రెయినియన్ సిటీ క్రీవీ రిహ్‌లెపి అపార్ట్‌మెంట్‌పై మంగళవారం బాలిస్టిక్ మిసైళ్లతో రష్యా దాడి చేసింది. ఈ దాడిలో ఒకరు మరణించగా, 15 మంది గాయపడ్డారు. రష్యా దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు చేయడానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ క్రిస్మస్‌ను ఎంచుకున్నారని మండిపడ్డారు. ఇంతకన్నా అమానుషత్వం ఏముంటుందని ఆయన ప్రశ్నించారు. పుతిన్ ఉద్దేశపూర్వకంగానే క్రిస్మస్ రోజును ఎంపిక చేసుకున్నారని జెలెన్‌స్కీ ఆరోపించారు. రష్యా 70 క్షిపణులను, 100కు పైగా అటాక్ డ్రోన్‌లను ప్రయోగించిందని ఆయన పేర్కొన్నారు.

## ఇండియా కూటమిలో విభేధాలు

### కాంగ్రెస్ పై ఆప్ ఫైర్.. బయటకు పంపేందుకు ప్రయత్నాలు



**ఢిల్లీ:** ఇండియా కూటమిలో మరోసారి విభేదాలు బయటపడ్డాయి. కాంగ్రెస్, ఆప్ పార్టీలు కాంగ్రెస్‌లు భాగస్వామి పార్టీలు. వీటి మధ్య వైరం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీపై కాంగ్రెస్ ఆరోపణలతో వారి మధ్య వైరం బయటపడింది. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ తాజాగా ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం.

అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆమ్ ఆద్మీ పార్టీ ఇస్తున్న ఎన్నికల హామీలపై కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసింది. ఎన్నికల సందర్భంగా ఆచరణ సాధ్యం కాని హామీలు అమలు చేస్తామని కేజ్రీవాల్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ పార్టీని బయటకు పంపించేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ ప్రయత్నిస్తున్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ మేరకు కూటమి నుంచి కాంగ్రెస్‌ను బయటకు పంపించేలా ఇతర పార్టీలను ఒప్పించేందుకు సైతం ఆప్ ప్రయత్నాలు మొదలు పెట్టిందని చెబుతున్నారు. దీంతో కేంద్రంలో బీజేపీని అధికారం నుంచి దించేయాలన్న ప్రధాన లక్ష్యంతో సుమారుగా 25 విపక్ష పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి బీటలు వారుతున్నట్టవుతుంది. ఇప్పటికే కూటమిలో ఉన్న విభేదాలు లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్ఫుటం కాగా, ఇటీవల జరిగిన పలు రాష్ట్రా అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమికి నేతృత్వం వహిస్తున్న రాహుల్ గాంధీ పట్ల అందులోని పార్టీలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. రాహుల్ నాయకత్వంలో బీజేపీని ఎదుర్కోవడం కష్టమేనని, కాంగ్రెస్‌ను నమ్ముకుంటే తామూ మునగడం ఖాయమని పలు పార్టీల నేతలు భావిస్తున్నారంటా. ఈ క్రమంలోనే ప్రత్యామ్నాయంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నాయకత్వానికి జై కొడుతున్నారు. ఇప్పటికే సమాజ్‌వాదీ, ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్), శివసేన (యూబీటీ) సహా పలు మిత్రపక్ష పార్టీలు దీదీకి మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. చూడాలి మరీ ఈ విబేధాలు ఎక్కడి వరకు వెళ్తాయనేది.

## జపాన్ ఎయిర్‌లైన్స్‌పై సైబర్ అటాక్

### పలు విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం




జపాన్ ఎయిర్‌లైన్స్ పై సైబర్ దాడి జరిగినట్లు ఆ సంస్థ వెల్లడించింది. సైబర్ దాడి కారణంగా దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం పడిందని పేర్కొంది. టికెట్ల బుకింగ్ సేవలు నిలిచిపోయాయని, ఎయిర్‌పోర్ట్స్‌లో బ్యాగేజీ చెక్ ఇన్ సిస్టమ్‌లో కూడా సమస్య తలెత్తినట్లు తెలిపింది. గురువారం ఉదయం 7.24 గంటల నుంచి దేశీయ, అంతర్జాతీయ నెట్‌వర్క్‌లలో సమస్యలను గుర్తించినట్లు స్పష్టం చేసింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సంస్థ పేర్కొన్నది. ఈ క్రమంలో ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి ఎయిర్‌లైన్స్ క్షమాపణలు కోరింది. సైబర్ దాడి కారణంగా ఈ సంస్థకు చెందిన విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

## సిరియా మాజీ అధ్యక్షుడి భార్య ఆరోగ్య పరిస్థితి విషమం



సిరియాలో తిరుగుబాటుదళాల ఆక్రమణతో అధికారం కోల్పోయిన మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ దేశం విడిచి పారిపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన రష్యాలో ఆశ్రయం పొందుతున్నారు. ఈ క్రమంలో ఆయన వ్యక్తిగత జీవితానికి సంబంధించి పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. కాగా, మొన్నటికి మొన్న అసద్ నుంచి భార్య అస్మా అసద్ విడాకులు కోరుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా నివేదించిన విషయం విధితమే. తాజాగా అస్మా అసద్ ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్నట్లు సమాచారం. అస్మా అల్ అసద్ గత కొంత కాలంగా లుకేమియాతో బాధపడుతున్నారని, ప్రస్తుతం ఈ వ్యాధి తీవ్రమైనట్లు తెలుస్తోంది. రష్యాలోని రహస్య ప్రదేశంలో ఐసోలేషన్‌లో ఉంటూ చికిత్స పొందుతున్నట్లు అంతర్జాతీయ మీడియాలో వెల్లడైంది. ఆమె పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. ఆమె బతికే అవకాశం 50/50 మాత్రమే ఉందని ఆ కథనాల్లో పేర్కొన్నాయి. ఇదిలా ఉంటే.. అస్మా అల్ అసద్ లుకేమియా వ్యాధి బారినపడినట్లు ఈ ఏడాది మేలో అప్పటి సిరియా అధ్యక్ష కార్యాలయం నుంచి ఓ ప్రకటన వచ్చిన విషయం తెలిసిందే. సిరియా ప్రథమ పౌరురాలు అస్మా లుకేమియా బారినపడినట్లు వైద్య పరీక్షల్లో తేలినట్లు సిరియా ప్రెసిడెంట్ ఆఫీస్ ఆ ప్రకటనలో పేర్కొన్నది. లుకేమియా అనేది తెల్లరక్త కణాల్లో వచ్చే ఒక ప్రమాదకరమైన ఇన్‌ఫెక్షన్ అని స్పష్టం చేసింది. కాగా, ఆమె 2019లో రొమ్ము క్యాన్సర్ బారిన పడిన విషయం తెలిసిందే. ఏడాదిపాటు చికిత్స పొందిన తరువాత ఆమె కోలుకున్నారు. ఆ తర్వాత నాలుగేళ్లు తిరగకుండానే లుకేమియా బారినపడ్డారు. అస్మా ఇంగ్లాండ్ రాజధాని లండన్‌లో సిరియన్ తల్లిదండ్రులకు 1975లో జన్మించారు.

## ఆయుధాల గర్జనను వెంటనే ఆపండి

### ప్రపంచ దేశాలకు పోప్ క్రిస్మస్ సందేశం



**వాటికన్ సిటీ :** ప్రపంచ దేశాలకు పోప్ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. ఈ పవిత్ర సంవత్సరంలో ఆయుధాల గర్జనలను ఆపే ధైర్యాన్ని కూడగట్టుకోవాలని, ప్రపంచంలో వ్యాపిస్తున్న విభజనలను అధిగమించాలని పోప్ ఫ్రాన్సిస్ అన్ని దేశాల ప్రజలకు క్రిస్మస్ సందేశం ఇచ్చా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్య ప్రాచ్యం నుంచి ఉక్రెయిన్ వరకు, ఆఫ్రికా నుంచి ఆసియా వరకు విస్తరిస్తున్న విభజనవాదానికి అడ్డుకట్ట వేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఏడాది క్రిస్మస్ 2025 పవిత్ర సంవత్సరంతోపాటు వచ్చింది. మన శత్రువులతోనూ విస్తృత స్థాయిలో సయోధ్య కుదుర్చుకోవాలని, ఆశావాద యాత్రికులుగా మారాలని పోప్ పిలుపునిచ్చారు.

## గోవాలో మునిగిన పర్యాటకుల బోటు

### ఒకరు మృతి.. ప్రాణాలతో బయటపడిన 20 మంది



**పనాజీ:** గోవాలో విషాదం చోటు చేసుకుంది. పర్యాటకుల బోటు ప్రమాదానికి గురైంది. నార్త్ గోవాలోని కంలంగుటే బీచ్ సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో 20 మంది ప్రాణాలతో బయటపడ్డారు. వీరందరినీ సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇద్దరు మినహా అందరూ లైఫ్ జాకెట్లు ధరించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ప్రాణ నష్టం పెద్దగా జరగలేదని వారు పేర్కొన్నారు. కాగా, ఈ ప్రమాదం బుధవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతిచెందిన వ్యక్తి వయసు 54 ఏండ్లు ఉంటుందని వారు తెలిపారు. ప్రాణాలతో బయటపడినవారిలో ఇద్దరు చిన్నారులు, ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. వీరిలో 13 మంది ఒకే కుటుంబానికి చెందిన వారని పోలీసులు తెలిపారు. వీరంతా మహారాష్ట్రలోని ఖేడ్ ప్రాంతానికి చెందినవారని చెప్పారు. తీరానికి 60 మీటర్ల దూరంలో బోటు మునిగిందని వారు తెలిపారు.



## పార్లమెంటు ఎదుట వ్యక్తి ఆత్మాహుతి యత్నం

**ఢిల్లీ:** న్యూఢిల్లీలోని కొత్త పార్లమెంటు వద్ద ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. దీంతో అంతా ఉలిక్కిపడ్డారు. పార్లమెంట్ ఎదుట ఓ వ్యక్తి బుధవారం ఆత్మాహుతి యత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పట్‌కు చెందిన జితేంద్ర అనే వ్యక్తి పార్లమెంటు ఎదుట ఉన్న పార్కులో పెట్రోల్ వంటి పదార్థాన్ని ఒంటిపై పోసుకుని ఆత్మాహుతి యత్నం చేశారు. మంటల్లో కాలుతూనే పార్లమెంటు మెయిన్ గేట్ వైపు వెళ్లాడు. 90 శాతం కాలిన గాయాలతో ఉన్న అతడిని ఆసుపత్రికి తరలించారు. అతని వద్ద ఓ డైరీ, రెండు పేజీల సూసైడ్ నోట్ ను స్వాధీనం చేసుకున్నారు. ఒకరితో వ్యక్తిగత శత్రుత్వం కారణంగానే అతడు ఈ చర్యకు పాల్పడినట్టుగా పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై దర్యాప్తును కొనసాగిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మంటల్లో చిక్కుకున్న రూ.9 కోట్ల కారు

### సోషల్ మీడియాలో వీడియో వైరల్



**ముంబై:** మహారాష్ట్రలోని ముంబైలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కోస్టల్ రోడ్ లో రూ. కోట్ల ఖరీదైన లగ్జరీ లాంబోర్గినీ కారు మంటల్లో చిక్కుకుంది. బుధవారం రాత్రి 10.20 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. కారు మంటల్లో చిక్కుకున్న విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. దాదాపు 45 నిమిషాలపాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. కాగా, ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. గుజరాత్ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఆరెంజ్ కలర్ కారు క్యాబిన్‌లో మంటలు వస్తున్న వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ కారు ఖరీదు రూ. 9 కోట్ల వరకు ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## బీజేపీ మాటలకు, చేతలకు పొంతన లేదు

### కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆగ్రహం

**ఢిల్లీ:** బీజేపీపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. బీజేపీ నేతలు ఏం చెబుతున్నారో అర్థం కావట్లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో కెన్ బెట్వా నదుల అనుసంధానం ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఖండ్వా జిల్లాలో ఓంకారేశ్వర్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును కూడా ఆయన వర్చువల్‌గా ప్రారంభించిన విషయం తెలిసిందే. కెన్‌బెట్వా నదుల అనుసంధానం ప్రాజెక్టు ద్వారా ఎంపీలోని 10 జిల్లాలకు చెందిన 44 లక్షల మందికి, ఉత్తర్ ప్రదేశ్‌లోని 21 లక్షల మందికి తాగునీటి అవసరాలు తీరనున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జైరాం రమేష్ మాట్లాడుతూ బీజేపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణంపై బీజేపీ చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన లేదని ఆయన విమర్శించారు.



## సర్కార్‌కు చేతకాకపోతే సాయం చేసేందుకు మేం సిద్ధం

### యూపీ ప్రభుత్వంపై అఖిలేశ్ యాదవ్ మండిపాటు..డబ్బు సంపాదనలో బీజేపీ నేతలు బిజీ- మాజీ సీఎం

**లక్నో:** యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో త్వరలో జరగనున్న మహా కుంభమేళాకు జరుగుతున్న ఏర్పాట్ల తీరుపై యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణ లోపానికి రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం మాడల్‌గా మారిందంటూ ఆయన విమర్శించారు. ఈ మెగా కార్యక్రమానికి సంబంధించి జరుగుతున్న భద్రతా ఏర్పాట్లపైనా అఖిలేశ్ పెదవి విరిచారు. అత్యంత కీలకమైన పోలీసు వ్యవస్థ కూడా నిర్వహణ లోపానికి బలయ్యే అవకాశం ఉందంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా భద్రత, రద్దీ నియంత్రణను పర్యవేక్షించేందుకు వాచ్ టవర్లు, జల్ పోలీస్ స్టేషన్లు కూడా నిర్మించలేదని, సీసీటీవీలను అమర్చలేదని అఖిలేశ్ సీరియస్ అయ్యారు. డబ్బు సంపాదన ధ్యాసలో బీజేపీ నేతలు బిజీగా ఉన్నారని, వారికి కుంభమేళా నిర్వహించడం చేతకాకపోతే ప్రభుత్వానికి సాయం చేసేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందంటూ ఆయన పేర్కొన్నారు. వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని అఖిలేశ్ డిమాండ్ చేశారు.



# పసిడి పరుగో పరుగు..

## ఏడాదికాలంలో 30 శాతం వరకు పెరిగిన ధరలు

### 2025లో పెద్దగా మార్పుండదంటున్న విశ్లేషకులు

**న్యూఢిల్లీ:** బంగారం ధగధగ మెరుస్తున్నది. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు ఏర్పడటంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో ప్రస్తుతేడాది ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. దీంతో గడిచిన ఏడాదికాలంలో బంగారం, వెండి ధరలు 30 శాతం వరకు పెరిగాయి. అగ్రరాజ్యం అమెరికా ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతుండటం, పశ్చిమాసియా దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితులు కారణంగా ఈ ఏడాది ధరలు భారీగా పెరిగాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ప్రస్తుతం బంగారం ధరలు దేశవ్యాప్తంగా రూ.76 వేల నుంచి రూ.78 వేల స్థాయిలో ఉన్నాయి. కానీ, వచ్చే ఏడాది తులం పుత్తడి ధర రూ.81 వేల స్థాయిలో ఉంటుందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. పుత్తడితోపాటు వెండి ధరలు భారీగా పెరుగుతున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో పాటు ఎలక్ట్రానిక్స్, సోలార్ ప్యానెళ్లు, హెల్త్‌కేర్, ఎలక్ట్రిక్ వాహనాల్లోనూ వెండి వాడకం భారీగా పెరిగింది. సరఫరాడిమాండ్ మధ్య వ్యత్యాసం అధికంగా ఉండటం కూడా ధరలు పెరగడానికి కారణమని వారు అంటున్నారు.

#### ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లు తగ్గించడం

ఫెడరల్ రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను క్రమంగా తగ్గించడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణమని విశ్లేషిస్తున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం కూడా కారణమన్నారు. యూఎస్ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మళ్లీ గెలవడంతో వ్యాపార అనుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నట్లు వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, ఈక్విటీ మార్కెట్లు కుప్పకూలుతుండటం కూడా ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను సురక్షితమైన గోల్డ్‌వైపు మళ్లించారు. గడిచిన రెండు నెలల్లో ఈక్విటీ మార్కెట్లు 11 శాతం వరకు నష్టపోయాయి. అలాగే పలు దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు 500 టన్నులకు పైగా బంగారాన్ని కొనుగోలు చేశాయి.

#### ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు

- అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం
- అమెరికా ఆర్థిక సంక్షోభంలోకి జారుకోవడం
- పెట్టుబడిదారులు ఈక్విటీల కంటే అతి విలువైన లోహాలకు మొగ్గుచూపడం
- మధ్య తూర్పుదేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడం



# దుమ్మురేపిన మ్యూచువల్ ఫండ్స్

**న్యూఢిల్లీ :** దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీకి ఈ ఏడాది గొప్ప ఉత్సాహమే లభించింది. ఈ సంవత్సరం మొదలు నవంబర్ నెలాఖరుదాకా మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) విలువ ఏకంగా రూ.17 లక్షల కోట్ల పైనే పెరిగింది మరి. గత ఏడాది డిసెంబర్ 31కల్లా రూ.50.78 లక్షల కోట్లుగా ఉన్న ఆస్తులు.. గత నెలాఖరుకు ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.68 లక్షల కోట్లకు చేరాయి. మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ అసోసియేషన్ (యాంఫీ) తాజాగా తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్) ద్వారా వచ్చిన పెట్టుబడులు రూ.2.4 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. డిసెంబర్ గణాంకాలూ వస్తే ఆస్తులు మరింతగా పెరగడం ఖాయమే. ఈ క్రమంలో ఈక్విటీ ఫండ్స్‌ల్లోకి, ప్రధానంగా సిప్‌ల ద్వారా పెట్టుబడులు వచ్చే ఏడాది కూడా పెరుగుతాయన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# కిరాణా స్టోర్లకు దెబ్బేస్తున్న క్విక్ కామర్స్..!

### కేంద్రానికి రిటైలర్ అసోసియేషన్ కీలక విజ్ఞప్తి..!



**న్యూఢిల్లీ :** క్విక్ కామర్స్ సేవలనుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవాలంటే కిరాణా స్టోర్లకు వెంటనే మెరుగైన సాంకేతిక సేవలు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రిటైలర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఆర్ఏఐ) కోరుతున్నది. క్విక్ కామర్స్ సేవలను ఇప్పటికే స్విగ్గీ, బ్లింకిట్, జెప్టోలు ప్రారంభించాయని, దీంతో కొనుగోలుదారులు ఇంటికే పరిమితమయ్యే అవకాశాలున్నాయని, ఈ నేపథ్యంలో కిరాణా దుకాణాదారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నదని, వెంటనే కేంద్రం జోక్యం చేసుకొని కిరాణా దుకాణాదారులకోసం ప్రత్యేకంగా టెక్నాలజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 42 రిటైల్ అసోసియేషన్ కింద 80 లక్షల మైక్రో, చిన్న మధ్యతరహా రిటైలర్లు ఉపాధి పొందుతున్నారు. ఇప్పటికే కిరాణా దుకాణాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని, నూతన కస్టమర్లను అవసరాలను తీర్చడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు, ఇప్పుడు క్విక్ కామర్స్ కూడా ప్రవేశించడంతో వీటిపై పిడుగుపడినట్లు అయిందని ఎఫ్ఆర్ఏఐ ప్రతినిధి మిశ్రా తెలిపారు. కిరాణా స్టోర్ల కంటే క్విక్ కామర్స్ సంస్థలు అధికంగా రాయితీలు ఇస్తున్నాయని, అతిపెద్ద గిడ్డంగులు, అధిక కస్టమర్లు కలిగివుండటంతో వీటిపై ప్రతికూల ప్రభావం పడనున్నదన్నారు. క్విక్ కామర్స్ సంస్థలు ప్రవేశించడంతో పోటీ మరింత పెరిగిందన్నారు.

# బీమాకు తగ్గుతున్న గిరాకీ..

### ఏటేటా పడిపోతున్న కొత్త పాలసీ కవరేజీలు

#### 2023-24లో 4 నుంచి 3.7 శాతానికి క్షీణించిన వృద్ధి.. ఐఆర్‌డీఏఐ వార్షిక నివేదికలో తేటతెల్లం



**న్యూఢిల్లీ :** ఓవైపు దేశంలో 'అందరికీ బీమా' లక్ష్యంతో భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికారిక సంస్థ (ఐఆర్‌డీఏఐ) ముందుకెళ్తుంటే.. మరోవైపు ఏటేటా పాలసీలు తీసుకునేవారి సంఖ్య క్షీణిస్తున్నది. 2047కల్లా ప్రతీ భారతీయునికి బీమా ఉండాలన్నది బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐ ఆశయం. కానీ గత రెండు ఆర్థిక సంవత్సరాల తీరును చూస్తే.. ఇది నెరవేరడం అంత ఈజీ కాదని స్పష్టమైపోతున్నది. అవును.. ఐఆర్‌డీఏఐ 202324 వార్షిక నివేదికలోని వివరాలను చూస్తే ఇంతే మరి.

గత ఆర్థిక సంవత్సరం (202324) దేశంలో ఇన్సూరెన్స్ పెనెట్రేషన్ (జీడీపీలో వార్షిక ప్రీమియంల నిష్పత్తి) 3.7 శాతానికి పరిమితమైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (202223) ఇది 4 శాతంగా ఉండటం గమనార్హం. ఇక 202122లోనైతే 4.2 శాతంగా నమోదైంది. దీంతో ఏండ్లు గడుస్తున్నకొద్దీ కొత్త పాలసీలు అంతకంతకూ పడిపోతున్నాయన్నమాట. ఏటేటా ఇన్సూరెన్స్ కంపెనీలు వసూలు చేస్తున్న బీమా ప్రీమియంల ఆధారంగా ఈ బీమా పెనెట్రేషన్‌ను అంచనా వేస్తారన్న విషయం తెలిసిందే.

#### జీవిత బీమాలో..

జీవిత బీమాను తీసుకోవడంలో చాలామంది అంతగా ఆసక్తి చూపట్లేదని తాజా ఐఆర్‌డీఏఐ రిపోర్టు ఆధారంగా తేటతెల్లమవుతున్నది. ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన సంవత్సర కాలంలో లైఫ్ ఇన్సూరెన్స్ పెనెట్రేషన్ వృద్ధిరేటు 2.8 శాతానికి తగ్గుముఖం పట్టింది. అంతకుముందు ఏడాదిలో ఇది 3 శాతంగా ఉన్నది. ఇక నాన్‌లైఫ్ కవరేజీలు 1 శాతంతో స్థిరంగా ఉన్నాయి. దీంతో దేశంలో బీమా వ్యాప్తికి మరింతగా కృషి చేయాలని బీమా రంగ సంస్థలకు ఐఆర్‌డీఏఐ పిలుపునిచ్చింది. వచ్చే 23 ఏండ్లలో (2047 నాటికి) దేశంలోని మొత్తం జనాభాకు బీమా సదుపాయం ఉండేలా శ్రమించాలన్నది.

#### పెరిగిన తలసరి ప్రీమియం

గత ఆర్థిక సంవత్సరం తలసరి బీమా ప్రీమియం 95 డాలర్లకు పెరిగింది. అంతకుముందు ఇది 92 డాలర్లే. నాన్‌లైఫ్ ఇన్సూరెన్స్‌లో 22 నుంచి 25 డాలర్లకు పెరగగా.. లైఫ్ ఇన్సూరెన్స్‌ల్లో 70 డాలర్లుగానే ఉన్నది. కాగా, 201617 నుంచి ఏటా తలసరి బీమా ప్రీమియంలు పెరుగుతూనే ఉన్నట్టు ఐఆర్‌డీఏఐ చెప్తున్నది. ఇదిలావుంటే గత ఏడాది ప్రపంచ బీమా నమోదులో వృద్ధి 7 శాతంగా ఉన్నది. జీవిత బీమాలో 2.9 శాతంగా, జీవితేతర బీమా పాలసీల్లో 4.1 శాతంగా ఉన్నట్టు అంచనా. ఇక 2023లో ప్రపంచ తలసరి బీమా ప్రీమియం 889 డాలర్లుగా ఉన్నది. అమెరికా, దక్షిణ కొరియా, బ్రిటన్‌లలో ఇన్సూరెన్స్ పెనెట్రేషన్ వరుసగా 11.9, 11, 9.7 శాతాలుగా ఉన్నాయి. దక్షిణాఫ్రికాలోనూ 11.5 శాతం నమోదవడం విశేషం. నాన్‌లైఫ్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీలో 202324కుగాను క్లెయిముల నిష్పత్తి స్వల్పంగా తగ్గినట్టు ఐఆర్‌డీఏఐ తెలిపింది. 82.52 శాతంగా ఉందన్నది. 202223లో ఇది 82.95 శాతంగా ఉన్నది.





# నేటి నుంచే పీకేఎల్ ప్లేఆఫ్స్

**పూణె:** గత కొద్దిరోజులుగా క్రీడాభిమానులను అలరిస్తున్న ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) ముగింపు దశకు చేరుకుంది. లీగ్ దశలో రాణించి పాయింట్ల పట్టికలో టాప్6లో నిలిచిన హర్యానా స్టీలర్స్, దబాంగ్ ఢిల్లీ (ఈ రెండు జట్లు నేరుగా సెమీస్ చేరాయి), యూపీ యోధాస్, పాట్నా పైరేట్స్, యూ ముంబా, జైపూర్ పింక్ పాంథర్స్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయి. గురువారం యూపీ.. తొలి ఎలిమినేటర్‌లో జైపూర్‌తో తలపడనుండగా రెండో ఎలిమినేటర్‌లో పాట్నా.. ముంబైని ఢీకొననుంది. ఎలిమినేటర్ విజేతలు శుక్రవారం (డిసెంబర్ 27) హర్యానా, ఢిల్లీతో తలపడతారు. ఈనెల 29న ఫైనల్ జరుగనుంది.

### తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న

# పీవీ సింధు దంపతులు



భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు తిరుపతిలోని తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఇటీవలే సింధు వివాహం హైదరాబాద్‌కు చెందిన వెంకట దత్త సాయితో ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెళ్లి తర్వాత కొత్త దపంతులు అమ్మవారి ఆశీస్సుల కోసం తిరుమతి వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి సింధుదత్త సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని.. పెళ్లి తర్వాత అమ్మ ఆశీస్సుల కోసం వచ్చినట్లు సింధు తెలిపారు. కాగా, పీవీ సింధు - వెంకట దత్తసాయి వివాహం ఈనెల 22న ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఓ సరస్సులో 21 ఎకరాల్లో విస్తరించిన ఒక దీవిలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ జంట ఒక్కటైంది. ఇక పెళ్లికి సంబంధించిన ఫొటోలను కూడా సింధు సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ కూడా జరిగింది. పెళ్లి, రిసెప్షన్‌కు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

### కొన్‌స్టాస్‌ను భుజంతో ఢీకొట్టిన ఘటనలో..

# కోహ్లీకి మ్యాచ్ ఫీజులో 20% కోత




**మెల్‌బోర్న్:** మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగవ టెస్టులో.. యువ బ్యాటర్ సామ్ కొన్‌స్టాస్‌ను ..కోహ్లీ భుజంతో ఢీకొట్టాడు. క్రీజ్‌పై ఎదురెదురుగా నడుస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. ఆ ఘటన పట్ల ఐసీసీ చర్యలు తీసుకున్నది. కోహ్లీకి మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ పదవ ఓవర్‌లో ఈ ఘటన జరిగింది. పిచ్‌పై ఎదురెదురుగా వెళ్తున్న సమయంలో.. కొన్‌స్టాస్ భుజాన్ని కోహ్లీ తాకాడు. ఆ తర్వాత ఇద్దరూ ఒకర్ని ఒకరు తిరిగి చూసుకున్నారు. కొన్ని మాటలు అనుకున్నారు. మరో బ్యాటర్ ఖవాజా వచ్చి ఆ గొడవను కూల్ చేసే ప్రయత్నం చేశాడు. ఇద్దరు ప్లేయర్లతో చర్చించిన ఆన్‌ఫీల్డ్ అంపైర్లు.. కోహ్లీపై లెవల్ 1 అభియోగాన్ని నమోదు చేశారు. ఆ నేరం కింద అతనికి మ్యాచ్ ఫీజులో 20 శాతం కోత విధించారు. కోహ్లీకి ఒక మ్యాచ్ నిషేధం విధించే అవకాశాలు ఉన్నట్లు తొలుత కొందరు మాజీ క్రికెటర్లు అంచనా వేశారు. లెవల్ 2 నేరం అయితే కోహ్లీ నాలుగు పాయింట్లు కోల్పోయేవాడు. దాని వల్ల అతను ఓ టెస్టు మ్యాచ్‌ను దూరం అయ్యే అవకాశాలు ఉండేవి. క్రికెట్‌లో ఎటువంటి భౌతికపరమైన దాడి .. ఐసీసీ నియమావళిని ఉల్లంఘించినట్లు అవుతుంది. కోహ్లీ భుజం తాకిన ఘటనపై కొన్‌స్టాస్ స్పందించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత మాట్లాడుతూ.. అతనేమీ కావాలని భుజాన్ని ఢీకొట్టలేదన్నాడు. అకస్మాత్తుగా కోహ్లీ తనవైపు దూసుకొచ్చాడని, క్రికెట్‌లో ఇదంతా జరుగుతుందన్నాడు. ఇద్దరమూ భావోద్వేగానికి లోనైట్లు చెప్పాడు. ఈ ఘటన జరిగిన సమయంలో కొన్‌స్టాస్ 27 రన్స్‌తో క్రీజ్‌లో ఉన్నాడు. ఆ తర్వాత ఓవర్‌లో అతను బుమ్రా బౌలింగ్‌లో రెండు ఫోర్లు, ఓ సిక్సర్ కొట్టాడు.



# కెప్టెన్సీ రానందుకు పశ్చాత్తాపమేమీ లేదు

**చెన్నై:** సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌కు ఇటీవలే వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్ తనకు కెప్టెన్సీ దక్కలేదున్న పశ్చాత్తామపమేమీ లేదని అన్నాడు. అలాగే తాను ఘనమైన వీడ్కోలును కోరుకోలేదని, అలాంటి వాటికి తాను వ్యతిరేకమని తెలిపాడు. రిటైర్మెంట్ తర్వాత అశ్విన్ తన యూట్యూబ్ చానెల్‌లో మాట్లాడుతూ పై విధంగా స్పందించాడు. గ్రాండ్ సెండ్ ఆఫ్‌లు సూపర్ సెలబ్రిటీ సంస్కృతిలో భాగమని తాను భావిస్తానని, అలాంటి వాటికి తాను దూరంగా ఉంటానని అన్నాడు. తాను అంతర్జాతీయ క్రికెట్‌కు మాత్రమే వీడ్కోలు పలికానని క్రికెట్ గురించి మాట్లాడటం, కోచింగ్‌ను ఇష్టపడతానని అశ్విన్ తెలిపాడు. తన రిటైర్మెంట్‌కు ఎవరూ బాధ్యులు కాదని, ఎవరైనా ఉన్నా వాళ్ల గురించి తనకు తెలియదని చెప్పుకొచ్చాడు.

### రజనీకాంత్‌ను కలిసిన ప్రపంచ చెస్

# చాంపియన్ గుకేశ్



స్టార్ నటుడు రజనీకాంత్‌ను భారత యువ గ్రాండ్ మాస్టర్, ప్రపంచ చెస్ చాంపియన్ డి గుకేశ్ కలిశారు. రజనీ ఆహ్వానం మేరకు తల్లిదండ్రులతో కలిసి ఆయన ఇంటికి వెళ్లిన గుకేశ్ తలైవాను కలిశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను గ్రాండ్ మాస్టర్ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. విలువైన సమయాన్ని తనకోసం వెచ్చించిన రజనీకాంత్‌కు గుకేశ్ ధన్యవాదాలు తెలిపారు. మరో హీరో శివకార్తికేయన్‌ను కూడా గుకేశ్ కలిశారు. ప్రపంచ చెస్ చాంపియన్‌గా 18 ఏళ్ల గుకేశ్ అవతరించిన విషయం తెలిసిందే. సింగపూర్‌లో జరిగిన ఫిడే వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో చైనా క్రీడాకారుడు డింగ్ లిరెన్‌ను ఓడించి అతను విశ్వ విజేతగా నిలిచాడు. ఆ టైటిల్‌ను అందుకున్న అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 27-12-2024
ANN తెలుగు



# డిఫరెంట్ షేడ్స్‌లో లైలా

యువ హీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'లైలా'. కథానుగుణంగా ఈ సినిమాలోని కొన్ని ఎపిసోడ్స్‌లో ఆయన లేడీ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. లైలా పాత్రలో ఇప్పటికే విడుదలైన విశ్వక్‌సేన్ లేడీ గెటప్‌కు మంచి స్పందన లభించింది. బుధవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విశ్వక్‌సేన్ స్టైలిష్ లుక్స్‌తో కనిపించారు. మోడరన్ అవుట్‌ఫిట్‌లో ట్రెండీగా ఉన్నారు. ఈ సినిమాలో విశ్వక్‌సేన్ పాత్ర డిఫరెంట్ షేడ్స్‌లో సాగుతుందని, ఆయన కెరీర్‌లోనే వైవిధ్యమైన కథాంశమని మేకర్స్ తెలిపారు. ఆకాంక్షశర్మ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, దర్శకత్వం: రామ్ నారాయణ్.



# అర్జున్ సర్కార్ యాక్షన్

నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. సక్సెస్‌ఫుల్ 'హిట్' సినిమా ఫ్రాంఛైజీలో వస్తున్న మూడో చిత్రమిది. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. శ్రీనిధిశెట్టి కథానాయిక. ప్రస్తుతం కశ్మీర్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్నది. క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నాని.. అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాని స్టైలిష్ లుక్స్‌తో కనిపిస్తున్నారు. కశ్మీర్ షెడ్యూల్‌లో యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నామని, ఇవి సినిమాలో హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది మే 1న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జే మేయర్, రచనదర్శకత్వం: శైలేష్‌కొలను.

# యూఐ సినిమాతో యూత్ క్రష్‌గా మారిన రీష్మా..

## ఈ హీరోయిన్ వయసు ఎంతో తెలిస్తే..

కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర నటించిన యూఐ సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాతో యూత్ క్రష్ గా మారింది రీష్మా నానయ్య. ఇప్పుడు ఈ అమ్మడు గురించి తెలుసుకోవడానికి గూగుల్ సెర్చ్ చేస్తున్నారు నెటిజన్స్. సోషల్ మీడియాలో ఈ బ్యూటీకి ఓ రేంజ్ ఫాలోయింగ్ ఉంది. ఈ అమ్మడు షేర్ చేసే ఫోటోస్, వీడియోస్ తెగ వైరలవుతున్నాయి. రీష్మా నానయ్య.. యూఐ సినిమాలో అందం, అభినయంతో కట్టిపడేసింది. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ అమ్మడు వయసు తెలిసి షాకవుతున్నారు నెటిజన్స్. ఇప్పుడిప్పుడే సినీ పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకుంటున్న రీష్మా 28 ఏప్రిల్ 2001న జన్మించింది. అవును.. ఈ అందమైన అమ్మాయి 2K పిల్ల. ప్రస్తుతం ఈ బ్యూటీ వయసు కేవలం 23 ఏళ్లు మాత్రమే. 17 ఏళ్ల వయసులోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రీష్మా అనేక చిత్రాల్లో నటించింది. కానీ ఇప్పుడు ఉపేంద్ర నటించిన యూఐ సినిమాతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం రీష్మా పేరు సోషల్ మీడియా తెగ మారుమోగుతుంది. ఈ బ్యూటీని పుష్ప 2లో కిస్సిక్ ఫేమ్ శ్రీలీలతో పోలుస్తున్నారు నెటిజన్స్.



# నాకు సీఎం ఆఫర్ వచ్చింది.. తిరస్కరించా


## : సోను సూద్



బాలీవుడ్ స్టార్ నటుడు, రియల్ హీరో సోను సూద్.. కరోనా కష్టకాలంలో తన పెద్ద మనసు చాటుకున్న విషయం తెలిసిందే. ఎంతో మందికి తనవంతు సాయం చేసి రియల్ హీరోగా పేరు తెచ్చుకున్నారు. ఆ సమయంలో నెటిజన్లు సైతం సోనూని దేవుడిలా ట్రీట్ చేశారు. ఈ క్రమంలో సోను సూద్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తారన్న ప్రచారం కూడా జరిగింది. ఆ ప్రచారంపై సోను సూద్ తాజాగా స్పందించారు. మూవీ ప్రొమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సోను సూద్ మాట్లాడుతూ.. కొవిడ్ సమయంలో ప్రజలకు సాయం చేసినందుకు గానూ తనకు సీఎం, డిప్యూటీ సీఎం, రాజ్యసభ సభ్యుడు అయ్యే అవకాశాలు వచ్చాయని తెలిపారు. అయితే, ఆ అభ్యర్థనలను తాను సున్నితంగా తిరస్కరించినట్లు చెప్పుకొచ్చారు. 'నాకు సీఎం ఆఫర్ వచ్చింది. నేను నిరాకరించడంతో డిప్యూటీ సీఎంని చేస్తానని చెప్పారు. జాతీయ నాయకులు నాకు రాజ్యసభ సీటు కూడా ఆఫర్ చేశారు. అయితే, ఆ ఆఫర్లను నేను తిరస్కరించాను. స్వేచ్ఛను కోల్పోవడం నాకు ఇష్టం లేదు. అందుకే రాజకీయాలకు దూరంగా ఉండాలని అనుకుంటున్నా' అని ఈ రియల్ హీరో తెలిపారు. ప్రజలు రెండు కారణాల వల్ల రాజకీయాల్లోకి వస్తారని సోను సూద్ అభిప్రాయం వ్యక్తం చేశారు. 'ప్రజలు రెండు కారణాల వల్ల రాజకీయాల్లోకి వస్తారు. ఒకటి డబ్బు సంపాదించడం కోసం లేదా అధికారం కోసం. వాటిలో దేనిపైనా నాకు ఆసక్తి లేదు. ప్రజలకు సాయం చేయడం కోసం రాజకీయాల్లోకి రావాలనుకుంటే.. అది నేను ఇప్పటికే చేస్తున్నాను' అని పేర్కొన్నారు.

# ఎల్లమ్మలో నాయికగా?

సినిమాల ఎంపికలో సాయిపల్లవి చాలా సెలెక్టివ్‌గా ఉంటుంది. కథలో కొత్తదనంతో పాటు ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ ఉంటేనే అంగీకరిస్తుంది. అందుకే ఆమె ఒప్పుకునే సినిమాల గురించి ప్రేక్షకులు ఆసక్తిని కనబరుస్తారు. ఈ నేపథ్యంలో సాయిపల్లవి తెలుగులో మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..'బలగం' చిత్రంతో విమర్శకుల ప్రశంసలందుకున్నారు దర్శకుడు వేణు యెల్దండి. ఆయన తన తదుపరి చిత్రంగా 'ఎల్లమ్మ'ను తెరకెక్కించబోతున్నారు. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి దిల్‌రాజు నిర్మాత. తెలంగాణ నేపథ్య కథాంశమిది. ఇందులో కథానాయిక పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఈ కథ సాయిపల్లవికి బాగా నచ్చడంతో వెంటనే అంగీకరించిందట. అయితే ఈ వార్తలో వాస్తవమేమిటో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. ప్రస్తుతం సాయిపల్లవి 'తండేల్' చిత్రంలో నటిస్తున్నది. ఫిబ్రవరిలో ఈ సినిమా విడుదలకానుంది. అనంతరం 'ఎల్లమ్మ' సినిమా పట్టాలెక్కుతుందని సమాచారం.



# నేను నిర్దోషిగా బయటకొస్తాను

## : జానీ మాస్టర్



లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయ్యి బెయిల్ మీద బయటకు వచ్చిన కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై పోలీసులు కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారంటూ వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై జానీ మాస్టర్ క్లారిటీ ఇచ్చాడు. మీడియాలో వస్తున్న వార్తలు అబద్ధం. న్యాయస్థానంపై నాకు నమ్మకం ఉంది. న్యాయస్థానంలో న్యాయం ఉంది కాబట్టే ఈరోజు ఇలా నేను బయటకు వచ్చి నా పని నేను చేసుకుంటున్నాను అని పేర్కొన్నారు. నా మనసుకు తెలుసు ఏం జరిగిందని.. ఆ దేవుడికి తెలుసు. నా విషయంలో తీర్పును న్యాయం స్థానం నిర్ణయిస్తుంది. న్యాయస్థానం నుంచి నేను నిర్దోషిగా బయటికి వస్తాను. ఆరోజు అందరి ముందుకు వచ్చి మాట్లాడుతాను. నేను ఇప్పుడు నింది తుడిని మాత్రమే. నాకు తెలిసింది ఒక్కటే విద్య. డాన్స్‌తో మిమల్ని ఎంటర్‌టైన్ చేయడం. మీ అందరి దీవెనల వల్లనే నేను ఇప్పుడు ఈ స్థానంలో ఉన్నాను.. మీ అందరిని అలరించడానికి కష్టపడతాను.. మీ ప్రేమ ఎల్లప్పుడూ ఇలానే ఉండాలని కోరుకుంటున్నాను అని ఆయన చెప్పుకొచ్చారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com